అందరి అభిప్రాయాలతో ఇందిరమ్మ కమిటీ

కార్పొరేటర్ పుష్ప నగేష్



నవతెలంగాణ - రామచంద్రాపురం:
అందరి అభిప్రాయాలు సూచనలతోనే నూతన ఇందిరమ్మ కమిటీని ఏర్పాటు చేసుకుందాం అని కార్పొరేటర్ పుష్ప నగేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు శుక్రవారం పట్టణంలోని వార్డ్ కార్యాలయంలో స్థానిక రామచంద్రాపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీ కొరకు సమీక్షా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అందరి సలహాలు సూచనలతో ఇందిరమ్మ కమిటీని త్వరలోనే పూర్తి చేద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మవీన్ గౌడ్, ఈశ్వర్ కపూర్, సతీష్ గౌడ్, పీటర్, నవీన్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి, ఐలాపూర్ ఐలేష్, ఎల్మర్తి మల్లేష్, మహిపాల్ గౌడ్, మహమ్మద్ హబీబ్, రాంజీ, శాంతమ్మ నగేష్, రాజేష్, శ్రీకాంత్, రవి గౌడ్, పాషా, రవీందర్ రెడ్డి, సామ్రాట్, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
శనివారం | 02 నవంబర్ 2024 | www.navatelangana.com

గంజాయి స్మగ్లర్లతో పోలీసుల దోస్తీ

నవతెలంగాణ-పటాన్‌చెరు : పట్టుబడ్డ గంజాయి కేసులో నిందితులను వదిలేసిన ఇద్దరు ఎస్ఐలు, ఒక హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌ను మల్టీ జోన్ 2, ఐజీ వి సత్యనారాయణ సస్పెండ్ చేశారు. పటాన్‌చెరు పీఎస్‌లో ప్రస్తుతం ఎస్.ఐగా పనిచేస్తున్న మూడ్ అంబారియాతో పాటు వీఆర్‌లో ఉన్న ఎస్.ఐ వినయ్ కుమార్, సీసీఎస్‌లో హెడ్ కానిస్టేబుల్ మారుతి నాయక్, ఏఆర్ కానిస్టేబుల్ మధులను సస్పెండ్ చేశారు. ఈ ఏడాది మేలో మనూర్ మండలం సనత్పూర్‌లో ఓ వాహనాన్ని అడ్డుకొని 120 కిల్లోల గంజాయిని తమ వాహనంలోకి తీసుకొని ఆ వాహనంతో సహా నేరస్థుడిని వదిలేసిన ఎస్.ఐ మూడ్ అంబార్య నాయక్, హెడ్ కానిస్టేబుల్ మారుతి నాయక్, కానిస్టేబుల్ మధులు. అదేవిధంగా గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముఠాను నిజామాబాద్‌లోని వర్ని దగ్గర అడ్డుకొని అక్కడి నుంచి వారిని నారాయణెడ్ తీసుకొని వచ్చి 400 ప్యాకెట్ల గంజాయిను తీసుకొని వాహనంతో సహా నేరస్థుడిని వదిలేసిన పోలీసులు బి.డి.ఎల్ - భానూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడ్డ గంజాయి అక్రమ రవాణా చేస్తున్న మల్లుగొండ, మల్లేష్ నాయక్, లకాస్‌ను పట్టుకొని విచారించగా పోలీసుల వ్యవహారం బయటపడింది. ఒకరిద్దరూ చేసే ఇటువంటి పనుల వలన పోలీస్ శాఖ ప్రతిష్ఠకు భంగం కలుగుతుందని ఐ.జీ. సత్యనారాయణ తెలిపారు.



ఎర్ర జెండా నీడన.. ప్రజా పోరాటాలు

- పోరాడి అటవీ భూములు సాధించిన సీపీఐ(ఎం)
- కార్మిక, రైతు ఉద్యమాలకు అండ
- సామాజిక వివక్ష వ్యతిరేకంగా పోరు
- సీపీఐ(ఎం) మెదక్ జిల్లా 15 వ మహాసభలు
- ఎరుపుమయమైన తూప్రాన్
- లింగారెడ్డి గార్డెన్ లో సభలు
- ముఖ్య అతిథిగా చుక్క రాములు, విజయలక్ష్మి హాజరు



ప్రజల కష్టాలు, కన్నీళ్లు ఎర్రజెండా మాత్రమే. పీడిత ప్రజల నిరంతరం అండగా ఉంటూ పోరాడేది ఎర్రజెండానే. పేదలు, రైతులు కూలీలు, కార్మికులు, కర్షకులు, మాహిళలు, యువజనులు, విద్యార్థులు... దళితులు గిరిజనులు, బీసీలు, మైనార్టీలు ఇలా ఎవరైనా సరే కుల, మత తేడాలేకుండా వారి పక్షాన పోరాడేది కూడా ఎర్రజెండానే. ఎన్నో ప్రజాపోరాటలకు నాయకత్వం వహించిన సీపీఐ(ఎం) ఎర్ర జెండా మెతుకు సీమ మెదక్ జిల్లాలో కూడా రెపరెపలాడుతోంది. సాగుదారులకు అటవీ భూములపై హక్కులు కల్పించాలని, కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, అనేక సమస్యలపై పోరాడిన సీపీఐఎం తన సంస్థ గత జిల్లా మహాసభలు ఈ నెల 2, 3 తేదీల్లో స్థానిక లింగారెడ్డి గార్డెన్లో 15వ జిల్లా మహాసభలు అట్టహసంగా జరగనున్నాయి. శనివారం పట్టణంలో భారీ బహిరంగ సభతో మహాసభలు ప్రారంభం కానున్నాయి. మహాసభల నిర్వహణ కోసం ఆహ్వాన సంఘం తూప్రాన్ భారీ ఏర్పాట్లు ఏర్పాటు చేసింది. ఎర్రజెండాలు, తోరణాలతో ముస్తాబైన ఎరుపు మయంగా మారింది.

నవతెలంగాణ - మెదక్ ప్రాంతీయ ప్రతినిధి
మెదక్ జిల్లా సిపిఐఎం 15వ జిల్లా మహాసభలు ఈ నెల 2, 3 తేదీల్లో తుప్రాన్ పట్టణంలో జరగనున్నాయి. గత మూడేళ్ల కాలంలో నిర్వహించిన ఉద్యమాలు, రోజా పోరాటాలు, పార్టీ నిర్మాణానికి సంబంధించిన విషయాలపై ఈ మహాసభల్లో చర్చించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎంపికైన ప్రతినిధులు, ప్రత్యేక ఆహ్వానితులు మహాసభల్లో పాల్గొంటారు. రెండు రోజులపాటు జరిగే మహాసభల్లో మెదక్ జిల్లా రాజకీయ ఆర్థిక,సామాజిక, సాంస్కృతిక రంగాలకు సంబంధించిన అంశాలపై మహాసభలో నిర్దిష్టంగా చర్చిస్తారు. కార్మికులు, రైతులు, మహిళలు, దళితులు, మైనార్టీలు, గిరిజనులు, విద్యార్థులు, యువజనులు పలుకు తీర్మానాలు చేయనున్నారు. మహాసభలను ఉద్దేశించి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు, ఇతర నాయకులు పాల్గొని దిశ నిర్దేశం చేయనున్నారు.

నేడు భారీ ప్రదర్శన


సీపీఐ ఎం మెదక్ జిల్లా 15వ మహాసభలు శనివారం తుప్రాన్ పట్టణం లో ప్రారంభం కానున్నాయి. స్థానిక లింగారెడ్డి గార్డెన్లో మహాసభలు జరగనున్నాయి. ఈ సందర్భంగా శనివారం తూప్రాన్ పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ పక్క నుంచి ర్యాలీ ప్రారంభం కానుంది. అక్కడి నుంచి పట్టణ వీధుల గుండా ర్యాలీ కొనసాగి లింగారెడ్డి గార్డెన్ కు చేరుకుంటుంది. మధ్యాహ్నం 12 గంటలకు లింగారెడ్డి గార్డెన్లో బహిరంగ సభ జరగనుంది. ఈ ర్యాలీ బహిరంగ సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు, విజయలక్ష్మి, మెదక్ జిల్లా కార్యదర్శి ఏ మల్లేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నర్సమ్మ, కే మల్లేశం, మహేందర్ రెడ్డి, బసవరాజ్‌తో పాటు ఇతర నాయకులు పాల్గొని ప్రసంగించనున్నారు.

ఎరుపెక్కిన తూప్రాన్

సీపీఐఎం మెదక్ జిల్లా 15 వ మహాసభల సందర్భంగా నిర్వహించే ప్రదర్శన, బహిరంగ సభ, మహాసభలు కోసం తూప్రాన్ పట్టణం ముస్తాబయిం ది. ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో తోరణాలు, ఎర్రజెండాలతో అలంకరిం చారు. ఎటు చూసినా ఎగిరే ఎర్రజెండాలతో తూప్రాన్ పట్టణం ఎరుపుమయమంగా మారింది. పట్టణ వీధులన్నీ ఎరుపెక్కాయి. ప్రజా పోరాటల క్షేత్రమైన తూప్రాన్ పట్టణం సిపిఐ ఎం మహాసభలకు ఆతిథ్యం ఇవ్వబోతుంది. ర్యాలీ, సభకు సిపిఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ సభ్యులు, అభిమానులు వేలాదిగా తరలిరానున్నారు. సభలకు హాజరయ్యే వాళ్ళందరికీ విస్తృత ఏర్పాటు చేసింది.

పోరాటాలు - విజయాలు

సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి ఎ. మల్లేశం



మెదక్ జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాటాలు చేసి విజయాలు సాధించామని సీపీఐ ఎం జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం అన్నారు. మహాసభల సందర్భంగా మెదక్ ప్రాంతీయ ప్రతినిధితో మాట్లాడారు. మెదక్ జిల్లాలో అత్యధిక భాగంగా విస్తరించి ఉన్న అటవీ ప్రాంతాన్ని ఆధారం చేసుకొని అనేక మంది పేద రైతులు అడవి భూములను సాగు చేసుకుని జీవిస్తున్నారని పేర్కొన్నారు. ఏళ్ల తరబడిగా సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు కల్పించాలని సీపీఎం పోరాడిందన్నారు. టేక్మాల్ మండలం అచ్చన్నపేట తండా, వేలు ఘనపూర్ మండలంలోని గ్రామాల్లో పేదలు అటవీభూవుల్ని సాగు చేసుకుంటే ఫారెస్ట్ అధికారులు దాడులు చేసి కేసులు పెట్టిన సందర్భాలు ఉన్నాయన్నారు. సాగుదారుల పక్షాన ఎర్రజెండా నాయకత్వం వహించి పోరాడిన ఫలితంగా హక్కుపత్రాలు సాధించబడ్డాయన్నారు. చేగుంట మండలం బిటోచుపల్లి 7 ఎకరాల భూముల్ని భూదాన్ ట్రస్ట్ ద్వారా పేదలకు పంపిణీ చేశారన్నారు. అలాంటి భూములపై కొందరు దొరలు కన్నేసి కాజేయాలని కోర్టు లో కేసులు వేసి స్టే తెచ్చారని తెలిపారు. రైతుల పక్షాన సిపిఎం ఎర్రజెండా పోరాడి భూమిని కాపాడేందుకు కృషి చేస్తుందన్నారు. మెదక్, రామాయంపేట నర్సాపూర్, తూప్రాన్ ప్రాంతాల్లో ఇల్లు లేని పేదల కోసం ఇళ్ల స్థలాల పోరాటం కొనసాగిందన్నారు. మెదక్‌లో పేదలను భయపెట్టి గుడిసెలను కూల్చివేసిన భయపడకుండ ఎర్రజెండా అండగా నిలిచిందన్నారు. ఆర్డీవో ఆఫీస్ వరకు 25 కిలోమీటర్ల పాదయాత్ర కొనసాగించామన్నారు. పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న మెదక్ జిల్లాలో అనేక ప్రైవేట్ కంపెనీలలో కార్మికులకు కనీస వేతనాలు లేవన్నారు. కార్మికుల పక్షాన ఎర్రజెండా పోరాడిన ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో మెరుగైన వేతనాలు పొందగలుగుతున్నారన్నారు. పనస కార్మికులు దుర్భర పరిస్థితిలో జీవిస్తుంటే ఎర్రజెండా ఆసరాగా నిలిచి వారికి సౌకర్యాలు, హక్కులు కల్పించాలని పోరాడేమన్నారు. దేశాయి బీడీ కంపెనీ కార్మికులపై జీఎస్టి పనుల భారం మోపి దోపిడికి పాల్పడుతుంటే సిపిఐఎం కార్మికుల పక్షాన పోరాడిందన్నారు. పరిశ్రమలో ప్రమాదాలకు గురై నష్టపోయిన కార్మికులకు పరిహారం ఇప్పించడంలో ఎర్రజెండా ముందుందన్నారు. ఆశాలు అంగన్వాడీలు మధ్యాహ్న భోజన కార్మికులు హమాలీలు భవనిర్మాణ కార్మికులు ట్రాన్స్పోర్ట్ కార్మికులు, మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ కార్మికులు సౌకర్యాలు హక్కుల కోసం ఎర్రజెండా అండగాల నిలిచి పోరాడిందన్నారు. సమాజంలో వివక్షకు గురవుతున్న దళితులపై కొనసాగుతున్న దాడులు బహిష్కరణలకు వ్యతిరేకంగా సిపిఐఎం అనేక పోరాటాలు చేసిందన్నారు. నర్సాపూర్ మండలం అహ్మదాబాద్ గ్రామంలో చనిపోయిన పశువులను పూడ్చే స్థల వివాదంలో దళితులపై అగ్ర కులాలు చేసిన ఆగడాల ను సిపిఎం ఎదిరించిందన్నారు. చిప్పలతూర్తిలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు విషయంలోనూ మనోరాబాద్ మండలంలో డప్పు కొట్టలేదన్న విషయంలోనూ ఆధిపత్య కులాలు కొనసాగించిన వివక్షను ఎర్రజెండా నే ప్రశ్నించిందన్నారు. బాధితుల పక్షాన నిలబడి న్యాయం జరిగేలా చూసామన్నారు. రెండు రోజులపాటు తూప్రాన్‌లో నిర్వహించే జిల్లా మహాసభలో ప్రజా సమస్యలపై చర్చిస్తామన్నారు. రాబోయే మూడు సంవత్సరాల కోసం భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని పేర్కొన్నారు.



భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వద్దు
సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు



నవతెలంగాణ-సంగారెడ్డి
భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వద్దని, ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు కార్మికులకు నేరుగా అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రైతు బజార్ వద్ద భవన నిర్మాణం కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం ఈ నాలుగు సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించి ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పుకోవాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి నిధులను దారి మళ్లించకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వకుండా ప్రభుత్వమే కార్మికులకు సంక్షేమ పథకాలు వెల్ఫేర్ బోర్డు ద్వారా అందించాలన్నారు. వెల్ఫేర్ బోర్డు నిధులను బిల్డింగ్ కార్మికులకు అందకుండా చేసి భవన నిర్మాణ కార్మికుల కడుపు కొట్టి పెద్ద పెద్ద ఇన్సూరెన్స్ కంపెనీలకు దోచిపెట్టటం కోసమే ప్రభుత్వం టెండర్లకు ఆహ్వానిస్తున్నదని మండిపడ్డారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. యాదగిరి మాట్లాడుతూ 1996 భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం నిబంధనల ప్రకారం వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని కార్మిక సంఘాల ప్రతినిధులతో నియమించి వారి ఆమోదంతోనే బోర్డు నిధులను ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు స్కీంలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వకుండా, ప్రభుత్వమే బోర్డు ద్వారా కార్మికులకు నేరుగా అందించాలన్నారు. బోర్డు నిధులు దుర్వినియోగం కాకుండా అడ్వైజరీ కమిటీని నియమించి సంక్షేమ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమానికే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాట నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భవనిర్మాణ యూనియన్ నాయకులు, పెంటయ్య ముత్యాలు, సంగమేశ్వర్ రాజు, మల్లేశం, దుర్గయ్య సురేఖ, సంగమ తదితరులు పాల్గొన్నారులి

టీటీడీ చైర్మన్ ను కలసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



నవతెలంగాణ-సంగారెడ్డి
టీటీడీ నూతన చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడును సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హైదారాబాద్‌లోని బీఆర్ నాయుడు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

పేలుడు పదార్థాలు, పద్ధతులపై కార్యశాల



ప్రధాన వక్తలుగా కేంద్ర విద్యాసంస్థలు, ఐఐటీ, ఎన్ఐటీ ప్రొఫెసర్లు

నవతెలంగాణ-పటాన్ చెరు
గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఓ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి వేదిక కాబోతోంది. 'మౌలిక సదుపాయాలు, గనులు, క్వారీ పరిశ్రమల కోసం పేలుడు పదార్థాలు, వాటిని వినియోగించే పద్ధతుల'పై రెండు రోజుల సాంకేతిక మార్పిడి కార్యశాలను గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌-లో డిసెంబర్ 13-14 తేదీలలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి, ఈ కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్ సీహెచ్. అఖిలేష్ శుక్రవారం వెల్లడించారు. ప్రాజెక్టు మేనేజర్లు, పేలుడు ఇంజనీర్లు, నియంత్రణ సంస్థలు, వాటిని నిర్వహించే సంస్థలు, తవ్వకం పనులు చేసే కాంట్రాక్టర్లు, పేలుడు పదార్థాల తయారీదారులు, పరిశోధకులు తదితరులు పేలుడు పరిజ్ఞానంలో మెళకువలు, అనుభవాలు, ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి ఈ కార్యక్రమం వీలుకల్పిస్తుందని తెలిపారు. భారతీయ పరిశ్రమ పేలుడు పద్ధతులను మెరుగుపరచడానికి వ్యూహాలను రూపొందించే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గీతం కోర్ ఇంజనీరింగ్ డీన్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వేదాల రామశాస్త్రిబీ బెంగళూరులోని నేషనల్ ఇన్-స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ డైరెక్టర్ డాక్టర్ హెచ్.ఎన్. వెంకటేష్‌బీ ఎన్ఐటీ రూర్కెలా ప్రొఫెసర్ సింగం జయంత్‌బీ నాగపూర్-లోని సెంటర్ ఫర్ మైనింగ్ అండ్ ఫ్యూయల్ రీసెర్చ్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం. రాములుబీ నాగపూర్-లోని విశ్వేశ్వరయ్య నేషనల్ ఇన్-స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ ఎస్.ఆర్.తోటబీ వారణాసిలోని ఐఐటీ-బనారస్ హిందూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సంజయ్ శర్మ తదితరులు ప్రధాన వక్తలుగా పాల్గొంటారని వివరించారు. ఈ రెండు రోజుల కార్యక్రమంలో పేలుడుకు రూపకల్పన, ఫలితాలలో జియాలజీ పాత్ర, పేలుడు పదార్థాలు-వాటికి ఉపకరించే పరికరాల అభివృద్ధి, ఉపరితలం, భూగర్భ తవ్వకాల కోసం పేలుడు వ్యూహం తదితర కీలకమైన అంశాలపై ఆయా రంగాల నిపుణులు ఉపన్యసించి, సందేహాలను నివృత్తి చేస్తారని డాక్టర్ అఖిలేష్ తెలియజేశారు .వసతి సౌకర్యం పరిమితంగా అందుబాటులో ఉందని, ఈ కార్యక్రమంలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న వారు తమ పేర్ల నమోదు, రుసుము తదితర వివరాల కోసం సమన్వయకర్త డాక్టర్ జి. జ్యోతికుమారి 97019 28209ని సంప్రదించాలని, లేదా jganta@gitam.eduకు ఈ-మెయిల్ చేయాలని ఈ సందర్భంగా సూచించారు.

సాధ్యంకాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి..

కేంద్ర మంత్రి బండి సంజయ్

నవతెలంగాణ-బెజ్జంకి
అచరణ సాధ్యంకాని హామీలిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని..అర్హులైన రైతులకు రుణమాఫీ,రైతు భరోసా అమలు చేయాలని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డికి హితవు పలికారు. మండల కేంద్రానికి చెందిన సంఘ ఎల్లవ్వ ఆనారోగ్యంతో బాధపడుతుండడంతో కేంద్ర మంత్రి బండి సంజయ్ బాధితురాలి కుటుంబ సభ్యులను బీజేపీ నాయకులతో కలిసి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి,ఎంపీ బండి సంజయ్ మాట్లాడారు. సమగ్ర ఇంటింటి సర్వే అనంతరం కేంద్ర ప్రభుత్వంపై యుద్ధం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి వాఖ్యలు చేయడం విడ్డూరమన్నారు. కుల, మత, వర్గ బేదం లేకుండా దేశ ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పనిచేస్తున్నందుకు యుద్ధం చేస్తారా?లేకా నరేంద్ర మోడీని ప్రధానిగా తొలగించి రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడానికి యుద్ధం చేస్తారా?రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేయాల్సింది యుద్ధం కాదని..యుద్ధప్రాతిపదికన ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయాలన్నారు. 29 జీఓతో విద్యార్థులు ఇబ్బందులు తలెత్తాయని, ఉద్యోగులకు డీఏ,ఫీజు రియంబర్స్ మెంట్ అందించాలని డిమాండ్ చేశారు. మూసీ పునరుజ్జీవం కమీషన్ల కోసమేనని.. మూసీకి కేటాయించిన రూ.1.50 కోట్లతో ప్రజా సమస్యల పరిష్కారించవచ్చని సూచించారు. కేంద్ర ప్రభుత్వ అవాస్ యోజనతో ఇందిరమ్మ ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతోందని తెలిపారు.



అంతకుముందు మండలంలోని అయా గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి బీజేపీ శ్రేణులు వినతిపత్రమందజేశారు. అంతకుముందు బీజేపీ నాయకులు మహపాల్ రెడ్డి,కొలిపాక రాజు,అజయ్ వర్మఅనిల్ రావు,మహిళ నాయకులు, కార్యకర్తలు కేంద్ర మంత్రికి శాలువాలు కప్పి ఘన స్వాగతం పలికారు.

మోకాళ్ల యాత్ర చేసిన ప్రజలు నమ్మరూ..

సీఎం రేవంత్ రెడ్డి, కేటీఆర్ పాదయాత్రల చేయడానికి సంసిద్ధులవుతున్నారని, వారు పాదయాత్ర కాదు కదా మోకాళ్ల యాత్ర చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని బండి సంజయ్ అన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధి పేరునా ప్రజాధనం దోపిడి చేసింది..ఈ ప్రభుత్వం మూసీ పునరుజ్జీవం పేరునా దోపిడి చేయడానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతిపక్ష నాయకుడు కేసీఆరే వ్యవసాయ క్షేత్రంలో కాలం వెల్లదీస్తున్నాడని..కేటీఆర్ దేనికోసం పాదయాత్ర చేస్తాడని ప్రశ్నించారు. వరదలు వచ్చినప్పుడు, ఉద్యోగుల,హైడ్రా,మూసీ అప్పుడు సమస్యలకు రారని..కుటుంబ సభ్యులకు సమస్యలు వస్తేనే బయటకు వస్తారని ఎద్దేవా చేశారు. నాయకుడుల్లేని నావవలే బీఆర్ఎస్ తయారైందని అసహనం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కోడుకు అహంకార దోరణివల్లే ప్రజలు చీదరించుకుంటున్నారన్నారు.

నేటి నుంచి సీపీఐ(ఎం) 15వ జిల్లా మహాసభలు

నవతెలంగాణ-తూప్రాన్
తూప్రాన్ పట్టణ కేంద్రంలో సీపీఐ(ఎం) 15వ జిల్లా మహాసభలు నవంబర్ 2,3 తేదీలలో పట్టణంలోని లింగారెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ.మహేందర్ రెడ్డితో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 15వ మెదక్ జిల్లా మహాసభలను తొలిసారిగా తూప్రాన్ పట్టణంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ జిల్లా మహాసభలకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి చుక్క రాములు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. 2వ తేదిన ఉదయం 11:30 నిమిషాలకు పెద్ద చెరువు కట్ట గంగమ్మ గుడి దగ్గర నుంచి తూప్రాన్ పట్టణం మీదుగా లింగారెడ్డి ఫంక్షన్ హాల్ వరకు భారీ ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు 15వ జిల్లా మహాసభలు ప్రారంభమవుతాయన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధుల సభ జరగనున్నట్లు తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏ.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించే 15వ జిల్లా మహాసభలకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.జయలక్ష్మి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.అడివయ్య, సీపీఐ(ఎం) సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల కార్యదర్శులు ఆముదాల మల్లారెడ్డి, గొల్లపల్లి జయరాజులు, ఏ.మల్లేశంలు, తదితరులు హాజరవుతున్నారని తెలిపారు. 15వ జిల్లా మహాసభల రెండవ రోజు ఆదివారం రోజున కూడా కొనసాగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు, కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు, వివిధ సంఘాల ప్రతినిధులు, పారిశ్రామిక కార్మికులు, సీపీఐ(ఎం) , సీఐటీయూ కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంస్థల ప్రతినిధులు, ప్రజలు భారీ ఎత్తున హాజరై 15వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.



ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



గజమాలతో సత్కరించిన పార్టీ నాయకులు

నవతెలంగాణ-మనోహరాబాద్
మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ జన్మదిన వేడుకలను మనోహరాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున హాజరై ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మనోహరాబాద్ మండల కేంద్రంలో నిర్వహించే జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మెదక్ నుండి జాతీయ రహదారిపై హైదరాబాద్ కు వెళ్తుండగా మార్గమధ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర సర్పంచుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల్ మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని రోహిత్ కు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారీ కేకును ఆయన కట్ చేసి నాయకులకు తినిపించారు. ఇందులో తూప్రాన్ ఉమ్మడి మండలాల పిఏసిఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి మైనంపల్లి రోహిత్‌కు శాలువాతో సత్కరించారు. అనంతరం మండల కేంద్రంలో జరుగుతున్న జన్మదిన వేడుకల కార్యక్రమానికి మైనంపల్లి హనుమంతరావు కూడా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిద్ధిపేట జిల్లా యువజన అధ్యక్షురాలు తూముకుంట అంక్ష రెడ్డి, నాయకులు కావేరి గారి వెంకటరెడ్డి, కావేరి గారి భగవాన్ రెడ్డి, మన్నె ధర్మేందర్, నాయిని యాదగిరి, రేకల కృష్ణ గౌడ్, శివగోని పెంటా గౌడ్, ఫ్యాక్స్ డైరెక్టర్ జావిద్ పాషా, సంతోష్ పంతులు, మల్లారెడ్డి, నాగరాజు గౌడ్, ఉమ్మన్నగారి భాస్కర్ రెడ్డి లతోపాటు అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నవ తెలంగాణ-నిజాంపేట
మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే రోహిత్ రావు జన్మదినం సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కట్ చేశామని తెలిపారు.అమ్మవారి కృపతో రానున్న రోజుల్లో మంత్రి పదవి పొందాలని నియోజకవర్గ ప్రజలకు మరెన్నో సేవలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో దేశెట్టి సిద్ధ రాములు, జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, మండల అధ్యక్షుడు మారుతి, పట్టణ అధ్యక్షులు నసీరుద్దీన్, వెల్దుర్తి వెంకటేష్ గౌడ్ ఎంఎస్ఎస్ఓ మండల ఇన్చార్జి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముత్యం రెడ్డి, అమర సేనా రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, లింగం గౌడ్, పాపయ్యగారి స్వామి, బ్రహ్మచారి, రామచంద్రనాయక్, మహేష్, బాజా రమేష్, మసుద్ అలీ మోహన్ రెడ్డి, ఆకుల బాలయ్య, జెల్లా లక్ష్మణ్ గౌడ్, రాజిరెడ్డి, వినోద్, అందే స్వామి, రజాక్ పల్లి కనకరాజు, తదితరులు పాల్గొన్నారు

నవతెలంగాణ-హవేలీఘనపూర్
హవేలీ ఘనాపూర్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రంలోని చౌరస్తాలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు జన్మదిన వేడుకలు సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సవితా శ్రీకాంత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాము,గణేష్, భరత్, సాయి, తేజ, ఆసిఫ్, ప్రవీణ్, భూమేష్, తదితరులు, పాల్గొన్నారు.

అకాల వర్షంతో తడిసి ముద్దయిన వడ్లు



నవ తెలంగాణ-హత్నూర

ఆరుగాలం కష్టంచి పండించిన వారి ధాన్యం కల్లాల్లోనే అకాల వర్షంతో తడిసి ముద్దయినాయి సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని కాసాల, దౌల్తాబాద్, రెడ్డి ఖానాపూర్, చింతల్ చెరువు, వడ్డేపల్లి, పలు గ్రామాల్లో రైతులు వరి ధాన్యాన్ని కోసి కళ్ళల్లో ఆరబెట్టే సమయంలో వర్షం రావడంతో వరి ధాన్యం తడిసి ముద్దయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కసారిగా ఆకాశంలో మబ్బులు ఏర్పడి వర్షం కురవడంతో ఏమి చేయాలో అర్థం కాక తాడిపత్రిలు కప్పినా వరి ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయి వర్షపు నీటిలో కొట్టుకుపోయాయని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం ఆర్భాటంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ వరి ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రభుత్వం కొత్త కొత్త నిబంధనలు పెడుతుంటే నష్టపోయేది మాత్రం రైతులేనని అది దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం స్పందించి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని లేని పక్షంలో రోడ్లపైకి వచ్చి నిరసన కార్యక్రమం చేయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

పూర్తి సమాచారాన్ని నమోదు చేయాలి



నవతెలంగాణ-వట్‌పల్లి

సమన్వయంతో ఇంటింటి సర్వే చేపట్టి కుటుంబ వివరాలన్నిటిని సేకరించి పూర్తి పూర్తి సమాచారాన్ని నమోదు చేయాలని డిప్యూటీ ఎమ్మార్వో షంబిరెడ్డి, ఎంపీడీఓ శశి ప్రభ తెలిపారు శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో అంగన్వాడి కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వవారు మాట్లాడారు. ఇంటింటి సర్వే చేపట్టడంలో చురుకుగా వ్యవహరించాలని ప్రతి అంశాన్ని కూలంకశంగా పరిశీలించి నమోదు చేయాలన్నారు. సర్వే చేపట్టడం సంబంధించిన ఫారాలను అందజేయడంతో పాటు స్టిక్కర్స్ కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ పోరాటాల ఫలితమే మెస్ కాస్మోటిక్ చార్జీల పెంపు

- మెస్ చార్జీలు పెంచడం పట్ల కేవీపీఎస్ హర్షం
- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్



నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టల్స్, గురుకుల పాఠశాల విద్యార్థులకు డైట్ కాస్మోటిక్ చార్జీలు పెంచుతూ జీవో నెంబర్ 9ని విడుదల చేయడం అభినందనీయమని వెంటనే అమలు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ ప్రభుత్వాన్ని కోరారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 9 ప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమెల మాణిక్ మాట్లాడుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో హాస్టల్లో సర్వేలు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రాష్ట్ర సంక్షేమ భవనం కార్యాలయం ముందు ధర్నాలు చేయడం వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. కేవీపీఎస్ పోరాట ఫలితంగా ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు మూడు నుంచి ఏడవ తరగతి వరకు ప్రస్తుతం రూ.950 నుంచి రూ.1330ల వరకు, 8వ తరగతి నుంచి పదవ తరగతి వరకు 1100 నుంచి 1540కి ఇంటర్ నుంచి పిజి విద్యార్థులకు రూ.1500 నుంచి రూ.2100 లకు పెంచిందని డైట్, చార్జీలు, కాస్మోటిక్ చార్జెస్ బాలికలకు మూడవ తరగతి నుంచి ఏడవ తరగతి వరకు రూ.55ల నుంచి రూ.175 ల వరకు ఎనిమిదో తరగతి నుంచి పదవ తరగతి వరకు రూ.75ల నుంచి రూ.275 ల వరకు బాలురకు మూడో తరగతి నుండి ఏడవ తరగతి వరకు రూ.62ల నుంచి రూ.150కు 8వ తరగతి నుంచి పదవ తరగతి వరకు రూ.62ల నుంచి రూ.200లకు పెంచుతూ జీవో నెంబర్ 9 ని తీసుకురావడానికి కెవిపిఎస్ హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. అలాగే అద్దె భవనాల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే చెల్లించాలని అన్ని హంగులు ఉండే విధంగా నూతన భవనాలు నిర్మించాలని కాలేజీ విద్యార్థులకు రూ. 2000లు ప్యాకెట్ మనీ ప్రతినెల ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అశోక్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శివకుమార్ జిల్లా సహాయ కార్యదర్శులు దాసు, ప్రవీణ్, జిల్లా కమిటీ సభ్యులు దత్తు, సిఐటియు నాయకులు బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

పిఎఫ్ విత్ డ్రా సమస్యను పరిష్కరించాలి

- కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ ఈ ఎస్ ఐ పి ఎఫ్ వెంటనే జమ చేయాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ ముందు ధర్నా
- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యస్ మహిపాల్



నవతెలంగాణ-జహీరాబాద్

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ పిఎఫ్, ఈఎస్ఐ డబ్బులను వెంటనే జమచేయాలని, పీఎఫ్ విత్ డ్రా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మున్సిపల్ ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ మాట్లాడుతూ గత అనేక సందర్భాల్లో పి.ఎఫ్ విత్ డ్రా సమస్యపై ఆందోళన నిర్వహించినా పరిష్కరించకుండా, డబ్బుల్ని జమ చేయకుండా నిలక్షంగా వ్యవహరించడం సరింది కాదన్నారు. తక్షణమే పెండింగ్లో ఉన్న పీఎఫ్ ఈఎస్ఐ డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఈ ఆందోళన కొనసాగుతుందని అన్నారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్యను పరిష్కారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ (సీఐటీయూ)నాయకులు యశోద, మోహన్, చంటి, కాంతమ్మ, నాగమ్మ తదితరులున్నారు.

అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తే చర్యలు

- అక్రమ మట్టి టిప్పలను సీజ్ చేసిన తహసిల్దార్ గంగాభవాని

నవతెలంగాణ-గుమ్మడిదల

అనుమతులు లేకుండా అక్రమ మట్టి రవాణా కొనసాగిస్తే.. కఠిన చర్యలు తప్పవని మండల తాహసిల్దార్ గంగాభవాని హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 30, 31 తేదీల్లో అర్ధరాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న పలు వాహనాలను స్వాధీనం చేసుకొని సంబంధిత పోలీస్ శాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు మట్టి టిప్పర్లు ఎలాంటి అనుమతులు లేకుండా రవాణా కొనసాగిస్తున్నారని గుర్తించి 4 టిప్పర్లను సీజ్ చేసినట్లు సూచించారు. అక్రమంగా మట్టి రవాణా కొనసాగిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా దీపావళి ఉత్సవాలు

నవతెలంగాణ-మనూర్

నాగల్గిద్దా మనూర్ మండలాల పరధి లోని గ్రామాలలో దీపావళి ఉత్సవాలు గురువారం చేసుకున్నారు. ఆయా గ్రామాల ప్రజలు జీవితంలో కొత్త వెలుగులతో సంతోషంగా పూజలు చేసి టపాసులు కాల్చారు.

జోగిపేటలో ఇందిరాగాంధీ వర్ధంతి



నవతెలంగాణ-జోగిపేట

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు జోగిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల ర్లు ఎస్. సురేంద్ర గౌడ్, డి.శంకర్, దుర్గేష్, కె. నాగరాజు, చందర్ నాయక్, మాజీ ఎంపిటిసి డిజి. వెంకటేశం, మాజీ వార్డు సభ్యులు పట్లోళ్ల ప్రవీణ్, చింతకుంట శివకుమార్, నాయకులు చిట్యాల మధు, లక్ష్మణ్, ప్రదీప్ గౌడ్, శరత్ బాబు, రాజశేఖర్, రాజు, యాదయ్య, కృష్ణ, మల్లేశం, నాగరాజు, అక్బర్, అబ్బాస్ అలీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో



నవ తెలంగాణ-వట్‌పల్లి

మండల పరిధిలోని మరవెల్లి గ్రామంలో అంగన్వాడి కేంద్రాన్ని ఎంపీడీవో శశి ప్రభ ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆమెరికార్డులను పరిశీలించి పిల్లలకు. ప్రభుత్వము సరఫరా చేస్తున్న సరుకులను వడ్డించాలన్నారు రికార్డుల లో నమోదైన సంఖ్య కంటే కేంద్రానికి వచ్చిన పిల్లలకు పొంతన లేకపోవడం చూసి అసంతృప్తి. వ్యక్తం చేసింది. అంగన్వాడి కేంద్ర పరిసర ప్రాంతము పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు సమయపాలన పాటించి చిన్నపిల్లలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు

పేకాటరాయుళ్ల అరెస్టు



నవతెలంగాణ-కోహిర్

మండలంలోని గుర్జ వాడ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. వారి వద్ద నుంచి 7 సెల్ ఫోన్లు రూ.5200లు, 3 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎంతటి వారైనా పేకాట ఆడితే వదిలే ప్రసక్తి లేదని, కేసు నమోదు చేస్తామన్నారు

మహిళ అదృశ్యం



నవతెలంగాణ- రాయికోడ్

మహిళా అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని నల్లంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ ఐ నారాయణ తెలిపిన కథనం ప్రకారం నల్లంపల్లి గ్రామానికి చెందిన మొటికే అడివమ్మ (75) గత నెల 31న సమయం అందాజ ఉదయం ఐదు గంటల 15 నిమిషాలకు కాలకృత్యాలు తీర్చుకుంటానని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఇంటి పక్కన వారికి, బంధువులకు బావుల దగ్గర వెతికిన కనిపించకపోవడంతో ఆమె కుమారుడు మొటికే శ్యామయ్య(36) ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

ఆటో బోల్తా పడి యువకుడు మృతి



నవతెలంగాణ-రాయికోడ్

ఆటో బోల్తాపతి యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని శంషాధిన్ పూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ ఐ నారాయణ కథనం ప్రకారం కర్నాటక రాష్ట్రం బీదర్ జిల్లా, భాల్కి తాలూకా, నాగరార్(కె)గ్రామానికి చెందిన బీరద్దార్ పండరి (25), ఆటో డ్రైవర్ వరవాటి శివాజీ (35)లు ఆటోలో పాత సంచులను తీసుకొని రాయికోడ్ గ్రామంలో దించి ఇద్దరు కలిసి వారి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఆటో డ్రైవర్ శివాజీ ఆటోను అతివేగంగా అజాగ్రత్తగా నడిపి అందాజా మధ్యాహ్నం మూడు గంటల సమయంలో శంశోద్దీన్ పూర్ గ్రామ శివారులో ఆటోను బోల్తా వేశాడు. ఆటోలో ఉన్న పండరికి తీవ్ర గాయాలయి రోడ్డు పక్కన పడి ఉన్నాడు. అంతలో 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి సమాచారం అందించగా వారు వచ్చి పరీక్షించి పండరి మరణించినారని తెలిపినారు. అనంతరం ప్రైవేటు అంబులెన్స్‌కు సమాచారం అందించి జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినారు. మృతుని తండ్రి దిలీప్‌కు సమాచారం అందించగా వారి కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి శవమై ఉన్నాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- రైతులకు ఇబ్బందులు పెట్టొద్దు
- జిల్లా అదనపు కలెక్టర్ మాధవి లత



నవతెలంగాణ-జోగిపేట

వరి కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మాధవిలత సూచించారు. శుక్రవారం జోగిపేట మార్కెట్ యార్డ్ ఆవరణలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఆరబెట్టిన వడ్లను ఆమె పరిశీలించారు. కొనుగోలు ప్రారంభించాలని రైతులు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. తమకు రైస్ మిల్స్, లారీలు అలాట్మెంట్స్ ఇప్పటివరకు చేయలేదని స్థానిక కేంద్రం నాయకులు తెలిపారు. వెంటనే ఆమె జోగిపేటలో ఉన్న రెండు రైస్ మిల్లర్ల యజమానులతో మాట్లాడమని, లారీలు కూడా సిద్ధంగా ఉన్నాయని వారికి సూచించారు. వెంటనే తూకం వేసి వడ్లను తొందరగా లిఫ్టింగ్ చేయాలని ఆమె ఆదేశించారు. యార్డుకు వచ్చిన ధాన్యం మొత్తం తొందరగా తూకం వేసి ఖాళీ చేయాలని ఆమె పిఎసిఎస్ అధికారులకు సూచించారు. ఆమె వెంట రాష్ట్ర మార్కెడ్ డైరెక్టర్ ఎస్. జగన్మోహన్ రెడ్డి, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం. జగన్ మోహన్ రెడ్డి, సివిల్ సప్లై డిఎం కొండలరావు, పిఎసిఎస్ డిసిఒ కిరణ్ కుమార్, డీఎస్ఓ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారి శ్రీహరి, సీఈవో నరసింహులు, డైరెక్టర్లు చింతకుంట బిక్షపతి, నాగరాజు, మధుసూదన్ రెడ్డి, నాయకులు అనిల్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలనుసద్వినియోగం చేసుకోవాలి

- పీఏసీఎస్ వైస్ చైర్మన్ దయాకర్ రెడ్డి



నవతెలంగాణ-గుమ్మడిదల

దళారి వ్యాపారుల నుంచి మోసపోకుండా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం వైస్ చైర్మన్ దయాకర్ రెడ్డి అన్నారు శుక్రవారం మండలంలోని రాంరెడ్డి బాయ్, గుమ్మడిదల, నల్లవల్లి, అన్నారం, గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ సన్న రకం వడ్లకు ప్రభుత్వ మద్దతు ధర రూ.2320లతో పాటు రూ. 500 బోనస్, దొడ్డు రకం ధాన్యంకు రూ.2300 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, పటాన్చెరు ఏడిఏ మనోహర, మండల వ్యవసాయ అధికారి డి శ్రీనివాస్ రావు, డిప్యూటీ తహసిల్దార్ కరుణాకర్ రావు, ఏఈఓ ఎస్ ప్రణవి, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, డైరెక్టర్స్ జయశంకర్ గౌడ్, డి శ్రీనివాస్, ఎర్రోళ్ల నర్సయ్య, లక్ష్మి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుట్ట నర్సింగ్ రావు, గుమ్మడిదల రైతు సంఘం అధ్యక్షులు పి మోహన్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మద్ది వీరారెడ్డి, ఎం నరేందర్ రెడ్డి, మద్ది ప్రతాప్ రెడ్డి, పడమటి లక్ష్మారెడ్డి, మద్ది నరసింహారెడ్డి, మద్దుల బాల్ రెడ్డి, కుమార్ గౌడ్, గోవర్ధన్ గౌడ్, చిమ్ముల నరసింహారెడ్డి, బాల కృష్ణ గౌడ్, పెంటా రెడ్డి, మంద భాస్కర్ రెడ్డి, ఆకుల ఆంజనే యులు ఇప్ప రాంరెడ్డి, ఎండి హుస్సేన్ పిఏసిఎస్ సిఈవో లక్ష్మణ్ నాయక్ వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు

సోయాబీన్ కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ

- జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్



నవతెలంగాణ-ఝరాసంగం

ఝరాసంగం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా చేపడుతున్న సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సోయాబీన్ కొనుగోలులో నాణ్యత ప్రమాణాలు పక్కాగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కొనుగోలు ఇన్చార్జి నిస్సార్ హైమద్‌కు ఆదేశించారు. తేమ 12 శాతం కంటే తక్కువ ఉండేలా, రాళ్లు, మట్టి, చెడిపోయిన, రంగు మారిన, మొలకెత్తిన ముడుకుపోయిన ధాన్యం వీటన్నిటికి ప్రామాణికంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. అంతేకాకుండా మండల కేంద్రంలోని వివిధ ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన రిజిస్టర్లు ఎప్పటికప్పుడు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని డీలర్లను సూచించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు బిక్షపతి, మండల వ్యవసాయ అధికారి వెంకటేష్, టెక్నికల్ ఏవో వినోద్ కుమార్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి చేసిన ఇందిరా గాంధీ

- నీలం మధు ముదిరాజ్
- గరీబి హటావ్ దేశ్ కో బచావో నినాదంతో పేదరిక నిర్మూలనకు కృషి
- ఐరన్ లేడీ స్ఫూర్తితో తెలంగాణలో సీఎం రేవంత్ పాలన



నవ తెలంగాణ-పటాన్‌చెరు

పేదరికం నిర్మలిస్తేనే దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని గరీబీ హటావో దేశ్ కో బచావో నినాదంతో పేదలకు సంక్షేమాన్ని దగ్గరకు చేసిన గొప్ప వీరవనిత మాజీ ప్రధాని భారతరత్న ఇందిరాగాంధీ అని మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ కాంగ్రెస్ పార్టీ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ కొనియాడారు.ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని చిట్కూల్‌లో ఆమె చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ పేదరికం నిర్మూలించే ప్రక్రియలో భాగంగా కూడు గూడు, గుడ్డ లేని నిరుపేదలకు సాగు భూములను పంచడమే కాకుండా పక్కా గృహాలను నిర్మించి కోట్లాదిమంది భారతీయుల గుండెల్లో పదిలంగా నిలిచిపోయారని తెలిపారు. ఆమె చేపట్టిన హరిత విప్లవంతో బీడు భూములు వ్యవసాయ భూములుగా మారి ప్రపంచానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా భారతదేశాన్ని నిలబెట్టారన్నారు. ఇందిరమ్మ పాలన స్ఫూర్తితో సీఎం రేవంత్ రెడ్డి పాలన కొనసాగిస్తూ అన్ని వర్గాలకు సంక్షేమాన్ని అందిస్తున్నాడన్నారు.

పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్యరావు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్‌కు చెందిన హొటల్ నందు నిర్వహించిన దీపావళి పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్యరావు పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆనందంగా పండగ జరుపుకోవాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే చీకట్లను తొలగించి వెలుగులు నింపే ఈ పండుగ సందర్భంగా, సుఖసంతోషాలతో మన జీవితాలు కళకళలాడాలని ఆకాంక్షిస్తూ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజి టి ఎస్ ఐ డి సి చైర్మన్ మహమ్మద్ తనివిర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై. నారోత్తం , మాజి మార్కెట్ చైర్మన్ గుండప్ప, మాజి ఆత్మ చైర్మన్‌లు విజయకుమార్,పెంట రెడ్డి, జహీరాబాద్ మండల అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరాసంఘం మండల అధ్యక్షులు వెంకటేశం ,న్యాల్కల్ మండల అధ్యక్షులు రవీందర్ , మొగుడంపల్లి మండల అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, మచెందర్, నామ రవికిరణ్, మాజి మున్సిపల్ చైర్మన్ తంజీమ్, మాజి పట్టణ అధ్యక్షులు యాకూబ్, మాజి కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయ చైర్మన్ నర్సింహ గౌడ్,మాజి సర్పంచ్ లు కిషన్, అమిత్ కుమార్, చిన్న రెడ్డి, ప్రభు పటేల్, నాయకులు సంగ్రామ పటేల్, వెంకట్, బిచ్చప్ప తదితరులు పాల్గొన్నారు.

వివిధ వ్యాపార సముదాయాల్లో..

పట్టణంలోని వివిధ వ్యాపార సముదాయాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పట్టణ పుర ప్రముఖులు మాజీ మున్సిపల్ చైర్మన్ మహంకాళి శుభాష్, అల్లాడి నర్సింలు, వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు అల్లాడి వీరేశం గుప్తా, శ్రీకాంత్ రెడ్డి, రంగా అరుణ్ కుమార్, మహమ్మద్ జహంగీర్, రాములు నేత, మోతీ రామ్, యునోస్, నారాయణరెడ్డి, బుచ్చిరెడ్డి, శేఖర్, బిజీ సందీప్ పాల్గొన్నారు.

ప్రణాళిక బద్ధంగా ఇంటింటి సర్వే చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి.
- ఇంటింటి సర్వేను పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రణాళిక బద్ధంగా ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణం లోని శివాజీ నగర్, సంగారెడ్డి మండల పరిధిలోని ఇరిగిపల్లి గ్రామాలలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొన్ని ఇండ్లను సందర్శించి వారి కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమగ్ర సర్వేలో ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సర్వే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు. కుటుంబ సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ అంశాలను సమీక్షించడం జరుగుతుం దన్నారు. ఈ సర్వే కోసం ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు బ్లాక్ ల వారీగా ఇండ్ల వివరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. సంగారెడ్డి మున్సిపల్ పరిధిలో అన్ని ఏర్పాట్లు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. సర్వే కోసం అవసరమైన ఇంటి జాబితా, ఫారాలు, స్టిక్కర్లు కలెక్టరేట్ ద్వారా తీసుకోవాలన్నారు. ఇంటి జాబితా ప్రక్రియను ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు ప్రారంభించేలా చూడాలని తహసిల్దారులు మున్సిపల్ కమిషనర్లు కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఇంటికి ఎన్యుమరేటర్లు వెళ్లి నిర్ణీత ప్రొఫార్మాలో సర్వే వివరాలను నమోదు చేయాలన్నారు. సర్వే పూర్తయిన ఇంటికి స్టిక్కర్లను అతికించాలన్నారు. ఇంటి జాబితా ఫారంలో అన్ని ప్రశ్నలకు నమోదు చేయాలని సూచించారు. ఇంటింటి సర్వే ఏర్పాట్లు పరిశీలించిన అనంతరం కలెక్టర్ ఇరిగిపల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తక్కువగా ఉండటం చూసి ఉపాధ్యాయులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు నమోదు పెంచడానికి ఉపాధ్యాయులు సిబ్బంది మరింత కృషి చేయాలన్నారు. మునిసిపల్ చైర్మన్ విజయలక్ష్మి, మండల ప్రత్యేకధికారి ఖాసీం బేగ్, తహశీల్దార్ దేవదాస్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహన్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం.. తప్పిన పెను ప్రమాదం





నవతెలంగాణ-హత్నూర

మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన చెరువు కట్టపై ఉన్న 11 కెవి విద్యుత్ తీగలతో ఒక్కసారిగా ప్రమాదం ముంచుకొచ్చింది. చెరువు గట్టు పొలాలకు వరి కోతకు హార్వెస్టర్ మిషన్ కట్ట పై నుంచి వెళుతున్న క్రమంలో అక్కడే ఉన్న 11 కెవి విద్యుత్ తీగలు క్రిందకు ఉండడంతో వరి కోత యంత్రానికి తీగలు దగ్గరకు వచ్చాయి. డ్రైవర్ వెంటనే అప్రమత్తమై కట్ట కిందికి టైరు దించగా పెను ప్రమాదం తప్పింది. కానీ యంత్రం ఒకపక్కకు జారడంతో జెసిబిలతో బయటకి లాగారు. ఇంతటి ప్రమాదానికి గల కారణం విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఒక నిండు ప్రాణం బలైయిపోయేదని రైతులు, గ్రామస్తులు మండిపడ్డారు. మరో ప్రమాదం జరగకుండా విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే 11 కెవి విద్యుత్ స్తంభాలకు ఉన్న తీగలను ఎలాంటి వాహనాలకు తగలకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యం



నవతెలంగాణ-చౌటకూర్ : సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి వరి ధాన్యం తడిసింది. అకాల వర్షం కురవడంతో వరి ధాన్యం తడవకుండా ఉండడానికి టాపర్లు కిరాయికి తీసుకోని వరి ధాన్యంపై కప్పినా టాపర్ల నుంచి నీరు కారడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. పండించిన పంట తడవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. కావున అధికారులు చర్యలు తీసుకొని ప్రభుత్వం అందించే టాపర్లను రైతులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా త్వరగా వరి కొనుగోలు ప్రక్రియ ప్రారంభించి రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని తెలిపారు.

ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా చేయాలి



నవతెలంగాణ-న్యాల్‌కల్

ఇంటింటి కుటుంబ సర్వే పంచాయతీ సెక్రటరీలు అంగన్వాడీల టీచర్లు పకడ్బందీగా చేయాలని సంగారెడ్డి జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్, న్యాల్ కల్ మండల స్పెషల్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి ఆదేశించారు. ఈనెల 6 తేదీ ప్రారంభం కానున్న సమగ్ర కుటుంబ సర్వే పూర్తి వివరాలు సేకరించాలని వారు అన్నారు . శుక్రవారం ముంగి, రామ్ తీర్థం, రుక్మాపూర్, మండల స్పెషల్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి, ఎంపీడీవో రాజశేఖర్ కలిసి గ్రామాల్లో ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామాల్లో త్రాగునీటి కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిం చాలన్నారు. నీరు పరిశుభ్రత ఉండేలా బాధ్యత గ్రామపంచాయతీ అధికారుల దేనన్నారు. గ్రామ పంచాయ తీ రికార్డులు, అంగన్వాడి పాఠశాల విద్యార్థుల సంఖ్య ఎంత మంది ఉన్నారు కనీస సదుపాయాలు ఉన్నాయా లేదా పరిశీలించారు . మిషన్ భగీరథ మంచినీరు వస్తుందా లేదా ఆరా తీశారు మిషన్ భగీరథ మంచినీరు గ్రామాల్లో వచ్చేలా సంబంధిత అధికారులకు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. మంచినీటి ట్యాంకులు పరిశుభ్రత, నీటి రిజిస్టర్, పారిశుధ్యం పలు పనులు ఆకస్మిక పరిశీలించారు. పంచాయతీ కార్యద ర్శులు త్రాగునీరు పారిశుద్యం నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అన్నారు. వారి వెంట ఎంపీడీవో రాజశేఖర్, ఎంపీఓ సురేష్, పంచాయతీ సెక్రెటరీ ముంగి కృష్ణ ప్రతాప్ రెడ్డి , రజనీకాంత్, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు

మొగుడంపల్లి యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్ష కార్యదర్శులుగా యాదయ్య ఫిరోజ్‌లు ఎన్నిక







నవతెలంగాణ-జహీరాబాద్

ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న సంఘం యుటిఎఫ్ అని రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ అన్నారు. శుక్రవారం మొగుడం పల్లి మండలం టీఎస్ యుటిఎఫ్ నూతన కమిటీని జహీరాబాద్ పట్టణంలో జెడ్పిహెచ్ఎస్ బాయ్స్ హై స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికల అధికారులు గా టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ కుమార్, శ్యామ్, వ్యవహరించారు. ఎన్నికల పరిశీలకులుగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు సువర్ణ. జిల్లా కార్యద ర్శులు, సంయుద్దీన్, సిరాజుద్దీన్, ముకుంద, జగన్మోహన్, వ్యవహరించారు. మండల అధ్యక్షులుగా యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా ఫెరోజ్, ఉపాధ్యక్షులుగా సుమలత, నిఖిల్, కోశాధికారిగా హతీక్ అహ్మద్, కార్యదర్శులుగా మహేష్, మహేందర్, తుకారాం, మంజుల, ఝాన్సీ, శరణ్య, కీర్తన, ఏకగ్రీవంగా ఎన్నుకోబ డ్డారు. నూతన అధ్యక్షుడు యాదయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉపాధ్యాయ సమ స్యల పరిష్కారం కోసం నిక రంగా పోరాడే సంఘం టీఎస్ యుటిఎఫ్ మాత్రమే, అలాంటి పోరాట సంఘానికి మండల అధ్యక్షులుగా అవకాశం ఇచ్చినందుకు రాష్ట్ర కమిటీకి జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని, అందుకోసం మొగుడంపల్లి మండల ఉపాధ్యాయులు టీఎస్ యుటిఎఫ్ పక్షాన నిలబడి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నవతెలంగాణ
3
మెదక్
శనివారం | 02 నవంబర్ 2024 | www.navatelangana.com

సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గౌరీ



నవతెలంగాణ-వెల్దుర్తి

మెదక్ జిల్లా తూప్రాన్ డివిజన్ కేంద్రంలో శనివారం నిర్వహించనున్న జిల్లాస్థాయి 15వ మహాసభలను విజయవంతం చేయాలని వెల్దుర్తి మండల సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గౌరీ శుక్రవారం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో హమాలి కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గౌరీ మాట్లాడారు. జిల్లా మహాసభలకు ఉమ్మడి మాసాయిపేట్, వెల్దుర్తి మండలాల్లోని కర్షక సోదరులను పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులను కాపాడడం కోసం సీపీఐ(ఎం) పోరాటం చేస్తుందన్నారు. సీపీఐ(ఎం), సీఐటీయూ అనుబంధ సంఘాల కార్మికులు, కర్షకులు తమ హక్కులను కాపాడుట కోసం భారీ ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట వ్య.కా.స నాయకుడు నరేందర్ హమాలి కార్మికులు పాల్గొన్నారు.

కాల్వకు గండి.. నీరంతా వృధా



నవతెలంగాణ-టేక్మాల్

అకాల వర్షంతో భారీగా నీరు రావడం వలన గుండుబాగు నుంచి పల్వంచ చెరువులోకి వస్తున్న వర్షపు నీరు ప్రవాహానికి మార్వానుకుంట వద్ద కాల్వకు గండిపడి నీరంతా వృధా పోతుందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు సకాలంలో స్పందించి కాల్వ గండిని మరమ్మతులు (చేసి)పూడిస్తే, నీరంతా వృధా పోకుండా గొలుసు కట్టు చెరువుల నుంచి యాసంగి సీజన్ మొత్తం చెరువులో కుంటల కింద పంటలు పండేవని అంటున్నారు. గతంలో గ్రామంలో దండోరా వేసి ప్రజలను అప్రమత్తం చేసి వర్షాలు పడే సమయంలో ఇంటికొకరు చొప్పున వెళ్లి కాల్వకు మరమ్మతులు చేస్తుండే వారన్నారు. ప్రస్తుతం ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షణలో చెరువుల కుంటలకు రక్షణ కల్పించి ప్రజలకు రైతులకు నీరు వృధా కాకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

అకాల వర్షానికి రైతన్న ఆగమాగం


నవతెలంగాణ-నిజాంపేట్



మండలం పరిధిలోని నస్కల్ గ్రామంలో రెండు గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా అతి భారీ వర్షం కురవడంతో వరి ధాన్యం ఆరబెట్టిన రైతులు ఆగమాగం అవుతూ వర్షం వరదలకు ధాన్యం కొట్టుకపోవటం వల్ల లబోదిబోమంటున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం చేసి వారం రోజులు గడుస్తున్న వరి ధాన్యాన్ని కాంటా చేయకపోవడంతో ఎండిన వడ్లు కూడా తడవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అసలే వర్షానికి ముందు వరికోసి ధాన్యం ఎండకు ఆరబెట్టుకొని కాంట వేసే సమయంలో అకాల వర్షం వల్ల మళ్ళీ రైతుకు తీరని బాధనే మిగిలిందని వారు అంటున్నారు. ఎండిన వడ్లు వెంటవెంటనే తరలిస్తే ఇంత నష్టం జరిగేది కాదని రైతులు వాపోతున్నారు. రాబోయే రోజులలో ఎండిన వడ్లను తొందరగా కాంటచేసి ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని రైతులు వేడుకుంటున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీకి హెచ్ నందిని ఎంపిక


నవతెలంగాణ-చేగుంట



చేగుంట మండలం చందాయిపేట గ్రామం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన హెచ్ నందిని సిద్దిపేటలో జరిగిన అండర్ 17 గర్ల్స్ విభాగంలో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ ఎంపికైనట్లు చందాయిపేట ఫిజికల్ డైరెక్టర్ శంకర్ తెలిపారు. నందిని రాష్ట్రస్థాయి కబడ్డీ మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో జరిగే క్రీడాల్లో పాల్గొంటుందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్, తాజా మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్, తాజా మాజీ ఉపసర్పంచ్ కొండూరి సంతోష్ కుమార్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సంతోష,ఉపాధ్యాయులు విఠల్ రెడ్డి, వరాల నర్సింలు, సిద్ధి రాములు, గిరిదర్, వీణ, అజీత, తదితరులు అభినందించారు.

అండర్ 17 కబడ్డీ పోటీలకు అక్షయ విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ-కొల్చారం



మెదక్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి అండర్ 17 కబడ్డీ బాలికల విభాగంలో మండలంలోని రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని అక్షయ శు క్రవారం రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం జరిగిందని పీటీ శ్రీధర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఉపేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం మహబూబ్ నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడలలో అక్షయ విద్యాయార్థిని పాల్గొంటుందని తెలిపారు.

ఎంఈఓగా నీరజకు అదనపు బాధ్యతలు

నవతెలంగాణ-నార్సింగి



పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ అదనపు డైరెక్టర్ వరంగల్ వారి మౌఖిక ఆదేశాల ప్రకారం డీఈఓ డీ రాధా కిషన్ నార్సింగి ఎంఈఓగా ప్రస్తుతం చెగుంట ఎంఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న టీ నీరజకు అదనపు భాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు తక్షణంగా బాధ్యతలు స్వీకరించాలని డీఈఓ ఆదేశించారు.

నిజాంపేటలో షార్ట్ ఫిలిం షూటింగ్


నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రంలోని మంజీరా స్కూల్ ఆవరణలో " గల్లీ గ్యాంగ్ " షార్ట్ ఫిలిం షుటింగ్ తీయడం జరిగింది. ఈ సందర్భంగా కథ స్క్రీన్ ప్లే దర్శకుడు శ్రీధర్ మాట్లాడుతూ సమాజానికి మంచి మెసేజ్ అందించే వినోదాత్మకం తో కూడిన షార్ట్ ఫిలిం అని యాక్షన్ తో కూడిన ఫిలిం అని ప్రతి ఒక్కరు చూసి ఆనందించవలసిన ఫిలిం అన్నారు. హీరోయిన్ రితిక నటన మంచి పెర్ఫార్మెన్స్ కనబరిచిందన్నారు. ఈ కార్యక్రమంలో నటీనటులు కెమెరామెన్ బత్తులశివ, లక్ష్మణ్, శ్రీకాంత్, దినేష్, చింటూ, ప్రవీణ్, నవీన్, మెడికల్ లక్ష్మణ్, చందు, గుడ్ల చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-చేగుంట



చేగుంట పట్టణ కేంద్రంలో దుర్గవ్వ అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకొని చేగుంట కాంగ్రెస్ పార్టీ నాయకుడు అయిత పరంజ్యోతి వారి కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించి, రూ.5 వేల ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, సోమ వెంకటేష్, బుర్ర చంద్రయ్య, బక్క మైసయ్య, ఎర్ర యాదగిరి, నర్సింలు, ఎర్ర దశరథ్, రమేష్, పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్



పెద్దశంకరంపేటతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గురువారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వర్తక వాణిజ్య దుకాణాలు, గృహాలలో ధనలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దుకాణాలను అరటి కొమ్మలతో విద్యుత్ దీపాలతో వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. చిన్న పెద్ద బాణాసంచా కాలుస్తూ దీపావళి పండుగను వైభవంగా చేసుకున్నారు.

ఆటో బైక్ ఢీకొని వ్యక్తి మృతి



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

ఎదురుగా వస్తున్న ఆటో బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన పెద్ద శంకరంపేట పట్టణ సమీపంలోని తిరుమలాపూర్ 161 వ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పేట ఏఎస్ఐ విటల్ తెలిపిన వివరాలు ప్రకారం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని గొట్టిముక్కల గ్రామానికి చెందిన తలారి పీరయ్య (36) అల్లాదుర్గంలో అతని పని ముగించుకొని పెద్ద శంకరంపేటకు తిరిగి వస్తుండగా పెద్ద శంకరంపేట నుంచి అల్లాదుర్గం వైపు వెళ్తున్న ఆటోను ఢీకొట్టడంతో పీరయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే 108లో జోగిపేట ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య తలారి సంతోష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్



స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యత దినోత్సవం కార్యక్రమాన్ని ఎస్సై సత్యనారాయణ ఘనంగా నిర్వహించారు. ఏక్తా దివస్ ప్రతిజ్ఞ, జాతీయ ఏక్తా దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం పోలీస్ స్టేషన్ లో సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రథమ హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని, ఆయన జయంతి రోజైన అక్టోబరు 31వ తేదీన జాతీయ ఐక్యత దినోత్సవంగా ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ ప్రజలను ఐక్యతా భావన వినిపించిన సర్దార్ పటేల్ ఆదర్శనీయుడని,స్వేచ్ఛా, స్వాతంత్రం ఫలాలను మనమందరం పొందుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సమీరుద్దీన్, సిబ్బంది బేతయ్య మల్లేశం, కుమార్, షమీ,వినయ్ తదితరులు, పాల్గొన్నారు.

కార్మికుల పక్షాన సీపీఐ(ఎం) పోరాటం

- ప్రభుత్వ రంగ సంస్థలలోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల పక్షాన సీపీఐ(ఎం)
- ఉమ్మడి మెదక్ జిల్లాకు ఒక్కరే లేబర్ ఉన్నతాధికారి
- పారిశ్రామిక ప్రాంతాల్లో కరువైన పర్యవేక్షణ
- కార్మికులపై 12 గంటల పని భారం, పట్టించుకోని లేబర్
- అధికారులు
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం



నవతెలంగాణ-తూప్రాన్



ప్రభుత్వంలోని వివిధ రంగాల్లో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ప్రైవేటు పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేసే పారిశ్రామిక కార్మికుల పక్షాన సీపీఐ(ఎం) నిర్విరామంగా పోరాటం చేస్తుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం తెలిపారు. మెదక్ జిల్లాలోని తూప్రాన్, మనోహరాబాద్, చేగుంట, మాసాయిపేట, నార్సింగి, వెల్దుర్తి, శివ్వంపేట, రామాయంపేట, నర్సాపూర్ మండలాల్లో పరిశ్రమలు అధికంగా ఉన్నాయన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు శ్రమదోపిడికి గురవుతున్నారన్నారు. కార్మికుల కోసం ఏర్పడిన కార్మిక చట్టాలు అమలు కావడం లేదన్నారు. పరిశ్రమల యాజమానులు కార్మికులతో 12 గంటలు పని చేయించుకుంటూ, కార్మికులకు శ్రమదోపిడి చేస్తూ, కార్మికుల శ్రమకు తగ్గట్లు వేతనాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. పరిశ్రమలు ఏర్పడిన ప్రాంతాల్లో స్థానికులకు ఇవ్వాల్సిన ఉద్యోగాలకు బదులుగా స్థానికేతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలను కల్పించడంలో మొండిచేయి చూపుతున్నారని వాపోయారు. ఒకవేళ స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ ఉన్న ప్రాంతాల వారికి ఆఫీస్ బాయ్, అటెండర్, స్వీపర్ లాంటి ప్రాధాన్యత లేని ఉద్యోగ అవకాశాలు స్థానికులకు కల్పించడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. దేశంలోని బీహార్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్, మరికొన్ని ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చిన వలస కార్మికులకే పరిశ్రమల యాజమాన్యాలు అధిక ప్రాధాన్యతనిస్తున్నాయని విమర్శించారు. పరిశ్రమలలో జరిగే వివిధ రకాల ప్రమాదాలతో కార్మికులు మరణిస్తే, పరిశ్రమల యాజమాన్యాలు అర్ధరాత్రి సమయాలలో ఎవరికి తెలియకుండా గుట్టుచప్పుడు కాకుండా కొంతమంది దుండగుల సహకారంతో వారి స్వస్థలాలకు కార్మికుల శవాలను తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు మరణిస్తే వారికి అందాల్సిన సంక్షేమ పథకాలు, వారు పొందాల్సిన హక్కులను పరిశ్రమ యాజమాన్యాలు కార్మికుల కుటుంబాలకు అందించకుండా, వారి హక్కులను తుంగలో తొక్కుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో పనిచేసే అన్ని రకాల కార్మికులకు అందాల్సిన సంక్షేమ పథకాలు, కార్మిక చట్టాలను ఆమలు చేసి తీరాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా అనేక పోరాటాలు చేసి కార్మికులు పొందాల్సిన హక్కులను కొన్నింటి మాత్రమే సాధించామని, భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేసి,కార్మికుల పక్షాన ఉద్యమిస్తామన్నారు.

పరిశ్రమ యాజమాన్యాలకు అధికారుల వత్తాసు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏ.మహేందర్ రెడ్డి




మెదక్ జిల్లాలోని వివిధ పరిశ్రమలలో పనిచేసే కార్మికుల రక్షణకై కార్మిక శాఖ అధికారులు కనీస పర్యవేక్షణ చేయడం లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ.మహేందర్ రెడ్డి తెలిపారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా అధిక పరిశ్రమలు ఉన్నాయని, పరిశ్రమలలో పనిచేసే కార్మికుల కోసం కార్మిక శాఖ అధికారులు పరిశ్రమల యాజమాన్యాలకే వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, వివిధ పరిశ్రమల్లో పనిచేసే పరిశ్రమల కార్మికులకు శ్రమకు తగ్గట్లుగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్,బోనస్ లాంటి సౌకర్యాలను కల్పించి, కార్మికుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక శాఖ అధికారులు అండగా ఉండాలన్నారు. వివిధ పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు 2,3 నెలలకోసారి వేతనాలు రావడంతో కార్మికులు చాలా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ, తమ కుటుంబాలను పోషించడం భారీ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒక్కరే డిప్యూటీ కార్మిక శాఖ అధికారిగా కొనసాగుతున్నారు. దీంతో కార్మికుల సమస్యలపై పర్యవేక్షణ లోపం కలుగుతుందన్నారు. సంగారెడ్డి, మెదక్, సిద్ధిపేట జిల్లాలకు ప్రత్యేక కార్మిక శాఖ పూర్తిస్థాయి అధికారులను ప్రభుత్వం వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేసే అన్ని రకాల కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల శ్రమదోపిడి చేస్తున్నా కానీ కార్మిక శాఖ అధికారులు చర్యలు చేపట్టడం లేదన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న 15వ జిల్లా మహాసభలలో కార్మికుల సమస్యలపై, కార్మికుల వేతనాలపై, ఈఎస్ఐ, పిఎఫ్, బోనస్, కార్మికులకు అందాల్సిన సంక్షేమ పథకాలపై, కార్మికుల హక్కులపై, కాంట్రాక్టు ఉద్యోగుల పర్మనెంట్, తదితర అంశాలపై చర్చించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రాంతాల్లో శాంతి కార్మికులకు నిర్వహణ కల్పించాలన్నారు. కార్మికుల వేతనాలు, భద్రత సంక్షేమం, పని గంటలు, వారం, ఇతర సెలవులు బోనస్ మొదలైన వాటికి కార్మిక శాఖ ఆధ్వర్యంలో పరిశ్రమల కార్మికులకు భరోసా కల్పించాలన్నారు. కార్మిక చట్టం కల్పించిన హక్కు ద్వారా కార్మికులకు పని భారం కలగకుండా 8 గంటల పనిని కల్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.పరిశ్రమల యాజమాన్యాలు 12 గంటల పాటు కార్మికులతో పని చేయించుకుంటూ శ్రమదోపిడి చేస్తున్నారన్నారు. కార్మికులకు అందాల్సిన పథకాల ద్వారా కార్మికులకు సంక్షేమం, సామాజిక భద్రతను ప్రోత్సహించాలని, కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లాలోని కార్మికుల పక్షాన పోరాటం చేసి కొన్ని హక్కులను పొందామన్నారు. భవిష్యత్తులో కార్మికుల సంక్షేమం కొరకై మరిన్ని పోరాటాలు చేసి, వివిధ రంగాల కార్మికుల పక్షాన నిలబడతామన్నారు.

ఎస్సీ రిజర్వేషన్‌కు నోచుకోని చల్మెడ



- ఆధ్యాత్మిక చింతనకు, పాడి పంటలకు నిలయం
- వ్యవసాయ రైతులు ఎక్కువే
- చల్మెడ సర్పంచ్ ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలి

నవతెలంగాణ-నిజాంపేట




పాడి పంటలకు పశువు సంపదకు వ్యాపార పరంగా, ఆధ్యాత్మిక చింతనకు నిలయం చల్మెడ గ్రామం అని చెప్పవచ్చు మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో వ్యవసాయంపై రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. వరి పంట, చేరుకు, పత్తి, మొక్కజొన్న, లాంటి పంటలు పండిస్తూ నిత్యం శ్రమ జీవులుగా జీవిస్తారు. ఈ గ్రామంలో కోళ్ల ఫారాలు 10 వరకు ఉంటాయి. మామిడి తోటల సాగు దాదాపు 200 ఎకరాలు, మొత్తం జనాభా 4,500, అందులో ఎస్సీ కుటుంబాలు 120, బిసి కుటుంబాలు 750, ఓసీ కుటుంబాలు 120, మొత్తం ఓటర్ల సంఖ్య 2908.

అధ్యాత్మిక చింతనకు నిలయం

ప్రతి మాఘమాస నెలలో తిరుమల స్వామి రథసప్తమి జాతరను నిర్వహించడమే కాకుండా గాయత్రి మాత, మడలయ గుడి, మహంకాళి అమ్మ, పెద్దమ్మ ,రేణుక ఎల్లమ్మ, గంగమ్మ , మండలంలోనే ఎక్కువగా గుడులను కలిగి ఉన్న గ్రామం చల్మెడ అని చెప్పొచ్చు. అత్యధికంగా భూ విస్తీర్ణం కలిగిన గ్రామం కూడా. ఈ గ్రామంలో అన్ని కులాల వారు ప్రేమానురాగాలతో కలిసిమెలిసి జీవిస్తారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తూ ఆధ్యాత్మిక చింతన వైపే నడుస్తారు.

కానీ స్వాతంత్రం సిద్ధించి 78 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచి, ఎంపీటీసీ, ఎండోమెంట్ చైర్మన్ లాంటి పదవులకు ఇప్పటికీ రిజర్వేషన్ కల్పించకపోవడం చాలా బాధాకరమని గ్రామానికి చెందిన ఎస్సీలు కొందరు వాపోతున్నారు. మండలంలోని ప్రతి గ్రామానికి రిజర్వేషన్ వచ్చిందని రెండు దఫాలుగా సర్పంచి పదవులను అనుభవించారని, కానీ చల్మెడ గ్రామానికి నేటికీ ఎస్సీ రిజర్వేషన్ కల్పించకపోవడంలో ప్రభుత్వాలు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నాయో అర్థం కావడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనైనా ఎస్సీలకు రిజర్వేషన్ వస్తుందేమోనని 10 సంవత్సరాల నుంచి ఎదురుచూశారు. అయినప్పటికీ కూడా ఎస్సీలకు రిజర్వేషన్ కేటాయించకపోవడం చాలా బాధాకరమంటూ కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సారైనా చల్మెడ గ్రామాన్ని ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

సర్పంచ్ పదవి ఎస్సీలకు రిజర్వ్ చేయాలి




దాదాపు 50 సంవత్సరాలుగా తాను చిన్నతనం నుంచి చూస్తున్న తమ గ్రామానికి ఎస్సీ సర్పంచి స్థానం రిజర్వేషన్ కల్పించలేదు. మండలంలోని జనాభా ప్రాతిపదికన కొన్ని గ్రామాలను ఎస్సీలకు రిజర్వేషన్ చేస్తారు. కానీ 78 సంవత్సరాల నుంచి నేటికీ రిజర్వేషన్ ఎందుకు కల్పించలేకపోయారో అర్థం కావడం లేదు. మండలంలో కొన్ని గ్రామాలను ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి చల్మెడ గ్రామాన్ని ఎస్సీ రిజర్వేషన్‌కు కేటాయించి దళితులకు న్యాయం చేయాలి.

కాకి రాజయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు, చల్మెడ గ్రామ వాసి


అకాల వర్షం.. తడిసిన వరి ధాన్యం

- నేటికీ ప్రారంభించని కొనుగోలు కేంద్రాలు
- అయోమయంలో రైతులు



నవతెలంగాణ-కొల్చారం

మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి రైతులు ఆరబెట్టిన ధాన్యంలోకి వర్షపు నీరు చేరింది. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతన్నలు ఆరబోసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆగమాగమయ్యారు. రంగంపేట సహకార సంఘం పరిధిలోని గ్రామాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను నామమాత్రంగా ప్రారంభించినప్పటికీ తూకం వేయడం మాత్రం ప్రారంభించకపోవడంతో.. ధాన్యం రాశులు కొనుగోలు కేంద్రాలలో కుప్పలు కుప్పలుగా పేరుక పోయాయని రైతులు వాపోయారు. తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కుప్పలను తూకం వేసి కొనుగోళ్లు ప్రారంభించాలని రైతన్నలు కోరుతున్నారు.



నవతెలంగాణ-వెల్దుర్తి

ఉమ్మడి మాసాయిపేట్ వెల్దుర్తి మండలాల్లో శుక్రవారం మిట్ట మధ్యాహ్నం ఉరుములతో కూడిన వర్షంతో రైతన్నలు ఆగమాగమయ్యారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కండ్ల ముందే వర్షం వరదల్లో కొట్టుకుపోతుంటే చేసేదేమీ లేక కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం ఆగమేఘాల మీద కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 15 రోజులు గడుస్తున్నా తూకం వేయడంలో మీన వేషాలు వేస్తున్నారు. ఆరుగాలం పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే కొనుగోలు ప్రక్రియ కొనసాగక వడ్ల కుప్పలను రాసులుగా పోసి ఎదురుచూసి ఎదురుచూసి కళు కాయలు కాస్తున్నాయని రైతులు అంటున్నారు. అకస్మాత్తుగా వర్షం వచ్చి వడ్లు తడిసిన ధాన్యాన్ని ఆరబట్టే లోపే మరలా వర్షం వస్తే చేసేదేమీ లేక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నామంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కుప్పలు కుప్పలుగా ధాన్యం రాశులు పేరుకపోయి స్థలాలు లేక రోడ్లపైన కూడా ధాన్యం ఆరబెట్టాల్సి వస్తుందన్నారు. ధాన్యం తూకం వేయడానికి వచ్చిన బీహార్ హమాలీలు పనులు లేక ఖాళీగా ఉండడంతో పూట గడవక పస్తులు ఉంటున్నామంటున్నారు. ఇలాగే కొనసాగితే మేము వెళ్లిపోతామన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని తూకం ప్రారంభం చేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో...

- జారీ పడుతున్న పట్టించుకోరా


నవతెలంగాణ-పాపన్నపేట



లక్షలాది భక్తుల ఇలవేల్పుగా నిలిచిన ఏడుపాయల వన దుర్గ మాత ఆలయం ముందు పాకూరు పట్టి వారం రోజులు గడిచిన సంబంధిత అధికారులు ఇంకా పట్టించుకోవడం లేదు. దీంతో నిత్యం భక్తులు జారీ పడుతూనే ఉన్నారు. వివరాలలోకి వెళ్తే ఏడుపాయల దుర్గామాత ఆలయం ముందు వరదలు వస్తే పెద్ద ఎత్తున పాకురుపడుతుంది, అయితే వరద తగ్గగానే పని వారిని పెట్టి ఇటిక పెల్లలతో గికి ఆ పాకురు మొత్తం తొలగించిన తర్వాతే భక్తులకు ఆలయ ప్రవేశం కల్పిస్తారు. ఇది అనాదిగా వస్తున్న ఆనవాయితీ, అయితే ఇటీవల వచ్చిన ఈవో ఇది ఏది పట్టించుకోవడంలేదని భక్తులు ఆరోపిస్తున్నారు. వరద తగ్గి, ఆలయం తెరిచి వారం రోజులు అవుతున్న కనీసం ఆలయం ముందు పాకూరు గీకించకపోవడంతో భక్తులు అది గమనించక జారి పడుతూనే ఉన్నారు. గత మూడు నాలుగు రోజుల క్రింద సైతం రాజగోపురం వద్ద పలువురు పాకూరులో జారిపడిన విషయాన్ని పత్రికల్లో వచ్చినప్పటికీ ఈవో కనీసం పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ ఆలయం తెలంగాణలోని ప్రసిద్ధిగాంచింది. ఇక్కడికి నిత్యం వేల సంఖ్యలో రాష్ట్ర, రాష్ట్రేతర భక్తులు వస్తుంటారు. ఆదాయం కూడా అంత ఇంత కాదు సంవత్సరానికి రూ.10 కోట్ల పైచిలుకు వస్తుంది, అంత ఆదాయం వచ్చినా ఆలయం ముందే భక్తులు జారిపడుతుండడం గమనార్హం. శుక్రవారం సైతం కొందరు భక్తులు పాకూరులోకి వెళ్లి జారీ పడడం కోసమెరుపు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆలయం ముందు పట్టిన పాకురు తొలగించాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడవద్దు

నవతెలంగాణ-టేక్మాల్



మారుమూల ప్రాంతం గిరిజనులు ప్రజలు ఆరోగ్యపరమైన ఇబ్బందులు పడకుండా ఉండడం కోసం తెలంగాణ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని జిల్లా జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎల్లుపేట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనుబంధంగా ఉన్న భవనాన్ని పరిశీలించారు. సదుపాయాలు కల్పించడం కోసం భవనస్థితిగతులను చూసి ఆయన మాట్లాడారు. కొత్త భవనం నిర్మించేంతవరకు మధ్య భవనంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నడపడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని గుర్తు చేశారు. ఇక్కడి ప్రజలు మండల కేంద్రమైన టేక్మాల్, పెద్ద శంకరంపేట, మెదక్ ఆసుపత్రులకు వెళ్తున్నారని అందుకోసం వారికి చాలా సమయం వృధా అవుతుందన్నారు. తక్షణమే వైద్య సహాయం అందించడం కోసం ప్రైవేటు భవనాన్ని పరిశీలించి ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ఈయన వెంట డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ నవీన్, మండల ఆరోగ్య విస్తరణ అధికారి సుగుణాకర్, ఎం.ఎల్.హెచ్.పి లావణ్య, ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశా కార్యకర్త రాణిలు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో రైస్ మిల్లులో అగ్నిప్రమాదం




నవతెలంగాణ-నార్సింగి

రైస్ మిల్లులో షార్ట్ సర్క్యూట్ తో చెలరేగిన మంటల వల్ల ఘోర అగ్ని ప్రమాదం జరిగి భారీగా గన్నీ సంచులు తగలబడిన ఘటన మండల కేంద్రంలోని తిరుమల రైస్ మిల్లులో చోటుచేసుకుంది. గురువారం రాత్రి దీపావళి పండుగ సందర్భంగా లక్ష్మీ పూజలు చేసి తిరుమల రైస్ మిల్ యజమాని ఎర్రం శ్రవణ్ కుమార్ ఇంటికి వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం 7 గం ఒక్క సారిగా రైస్ మిల్ ఆవరణలో మంటలు చెలరేగి భారీ సంఖ్యలో నిల్వ ఉంచిన గన్ని బ్యాగు లు పూర్తిగా తగల బడి పోయాయి. రైస్ మిల్లు లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటు కున్నట్లుగా తెలుస్తుంది. దీంతో వేల సంఖ్యలో గన్ని బ్యాగు లు తగలబడి, మంటలు వ్యాపించి పూర్తిగా పొగలు అలుముకున్నాయి. రామాయంపేట అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పినప్పటికీ పూర్తిస్థాయి లో గన్ని బ్యాగులు తగలబడి పోవడం తో సుమారు రూ. 9 నుంచి 12 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని యజమాని ఎర్రం శ్రవణ్ కుమార్ తెలిపారు.

జన్మదిన సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-చిన్న శంకరంపేట



మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు మరియు మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు దంపతులు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని కొరివి పల్లి దుర్గామాత అమ్మవారి ఆలయంలో శుక్రవారం హోమం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్వచ్ఛతలో పట్టణ ప్రజలు భాగస్వాములు కావాలి

-హుస్నాబాద్ మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



ప్రజలందరూ పట్టణాన్ని స్వచ్ఛతలో ముందు ఉండి పట్టణాన్ని స్వచ్ హుస్నాబాద్‌గా తీర్చిదిద్దడంలో తమ వంతు పాత్ర పోషించాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలో 20వ వార్డ్ ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ దీవాలి శుభ్ దీవాలి కార్యక్రమం నిర్వహించారు. రైతు బజార్, శివాజీ నగర్ ఏరియాలో రోడ్డు మీద బాణసంచాకి సంబంధించిన చెత్తను(హానికరమైన చెత్త)ను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజలు అందరూ కూడా గత ఏడాది కంటే ఈ ఏడాది బాణసంచా తక్కువగా కాల్చారని, పర్యావరణాన్ని రక్షించేందుకు తమ వంతు కృషి చేశారని చెప్పారు. పర్యావరణాన్ని రక్షించేందుకు కృషి చేస్తున్న ప్రజలందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ అనిత రెడ్డి, కౌన్సిలర్ వాల్ల సుప్రజ, కో ఆప్షన్ మెంబర్‌లు శంకర్ రెడ్డి, ఆయుబ్ , మాధవ రెడ్డి, కొమురవెల్లి రవీందర్, సుధాకర్ రెడ్డి, పర్యావరణ అధికారి రవికుమార్, జవాన్‌లు సారయ్య, ప్రభాకర్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి పంటకు మద్దతు ధర కల్పించాలి

నవతెలంగాణ- మర్కుక్



సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేసి, పంటకు మద్దతు ధర కల్పించాలని మర్కుక్ మాజీ ఎంపీపీ తాండ పాండు గౌడ్, మాజీ జెడ్పీటీసీ యెంబరి రామచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డిలు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మర్కుక్‌లో వారు మాట్లాడుతూ పత్తి పంటకు గిట్టుబాటు ధర లేక దళారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా వెంటనే సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పత్తికి క్వింటాలు రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ యేడు వర్షాలతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని. పెట్టుబడులు కూడా వస్తాయో లేదో అనే ఆందోళనలో ఉన్నారన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ప్రారంభం చేయకపోవడం వల్ల ప్రభుత్వం దళారీలను ప్రోత్సహించినట్టుగా ఉందన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో కూడా ప్రభుత్వం క్వింటాకు రూ.7521 ధర కల్పిస్తున్నారని, అలా కాకుండా కనీసం క్వింటాకు రూ.10వేలు ఇచ్చి రైతాంగాన్ని అదుకోవాలని కోరారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ పల్వన్

నవ తెలంగాణ - సిద్ధిపేట



సిద్దిపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ పల్వన్ కుమార్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వికారాబాద్ డిఎం హెచ్ ఓ గా కూడా పనిచేసిన ఆయన బదిలీపై జిల్లాకు వచ్చారు. అనంతరం ఆయనను డిప్యూటీ డిఎంహెచ్వోలు, ప్రోగ్రాం ఆఫీసర్లు , వైద్య అధికారులు కార్యాలయ సిబ్బంది వారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో లు డాక్టర్ ఆనంద్, శ్రీనివాస్, డా. రేవతి, నవీన్ రాజ్ కుమార్, అనిల్ కుమార్, కార్యాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఐఎన్‌టీయూసీ



జిల్లా నూతన వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ పల్వన్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (3194) జిల్లా అధ్యక్షులు కాల్వ చక్రధర్, ప్రధాన కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో డీహెమ్‌హెచ్‌ఓ కార్యాలయంకు వెళ్లి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్ర్యమంలో జిల్లా సంఘ సలహాదారు దొడ్డ రాజేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కోశాధికారి స్వామి, మహిళా వింగ్ అధ్యక్షురాలు శోభ, డివిజన్ అధ్యక్షులు రఘోత్తం రెడ్డి, కార్యదర్శి వేణు, పిఆర్‌ఓ మల్లయ్య, జిల్లా సంఘ బాధ్యులు సుధీర్, కోటేశ్వర రావు, సుజాత, స్వరూప, పద్మ, పాల్గొన్నారు.

జియోబిపి బంక్‌లో పెట్రోల్ పై ధర తగ్గింపు

నవతెలంగాణ-సిద్ధిపేట



దీపావళి పర్వదినం కానుకగా జియోబిపి పెట్రోల్ బంకులో పెట్రోల్ వినియోగదారులకు మార్కెట్ ధర కన్నా రూ.3 తగ్గింపు ఉన్నదని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట జియోబిపి పెట్రోల్ బంక్ యజమాని కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దీపావళి కానుకగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తగ్గింపు ఉంటుందని తెలిపారు. నవంబర్ 19 వరకు ఈ అవకాశం ఉంటుందని, పెట్రోల్ వినియోదారులు ఈ అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వోద్యోగం రాలేదని..ఉరేసుకుని ఆత్మహత్య

-గుగ్గిళ్లలో యువకుడి బలవన్మరణం

-దుర్వాసన వేదజల్లడంతో ఆలస్యంగా వెలుగులోకి

నవతెలంగాణ-బెజ్జంకి



యువకుడు ఉన్నతమైన విద్యను అభ్యసించాడు. ప్రభుత్వోద్యోగం కోసం పరితపించి నిరీక్షించాడు. ప్రభుత్వం విడుదల చేసిన అర్హతగల ఉద్యోగ పరీక్షలకు హాజరయ్యాడు. ఏ ఒక్క ప్రభుత్వోద్యోగం వరించకపోవడంతో యువకుడు ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడనే అభిప్రాయాలు గ్రామ ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. యువకుడి మృతదేహం దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు గమనించిన సంఘటన మండల పరిధిలోని గుగ్గిళ్ల గ్రామంలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం సోము శంకర్(35) గత కొద్దేండ్లుగా ప్రభుత్వోద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయ ఉద్యోగం వరించలేదు. తల్లిదండ్రులు గత కొద్దేండ్ల క్రితమే మృతి చెందారు. ఇంట్లో ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. గత రెండు రోజుల క్రితమే యువకుడు ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడి ఉండవచ్చునని, మృతదేహం దుర్వాసన వెదజల్లడంతో గమనించామని స్థానికులు తెలిపారు. మృతుని అన్న సోము రమేశ్ రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్నాడని స్థానికులు తెలిపారు. ఉన్నతమైన విద్యనభ్యసించి ప్రభుత్వోద్యోగం కోసం నిరీక్షించి యువకుడు బలవన్మరణానికి పాల్పడిన హృదయవికార ఘటన గ్రామస్తులను కలిచివేసింది. మృతుని అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని హెడ్ కానిస్టేబుల్ కనుకయ్య తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మర్కుక్



మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన కొనమైన మాదరి అనారోగ్యం ఇటీవల మృతి చెందాడు. శుక్రవారం బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కుక్ మండలా అధ్యక్షులు , జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట కొనమైన నర్సింలు, కోణమైన కృష్ణ ,లింగం, సాదుల్లా, స్వామి దుర్గేష్ ,మహేష్ ఉన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

-పలు కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-మర్కుక్



అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని నర్సన్నపేట పేట గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. మర్కుక్ ఎస్ఐ ఓ.దామోదర్ కథనం ప్రకారం వివరాలు ఇలా వున్నాయి. నర్సన్నపేట గ్రామానికి చెందిన డోకూరి బిచ్చిరెడ్డి (38) ఓ ప్రయివేట్ కంపెనీలో పనిచేస్తూ ఇటీవల మానేశాడు. బుధవారం రాత్రి 10:30 ని.లకు ఇంటి బయటకు వెళ్ళాడు. గురువారం తెల్లవారుజామున భావాని పీడ్ కంపనీ పరిసర ప్రాంతంలో శవమై కనిపించాడు. అటుగా వెళ్ళిన రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, మర్కుక్ ఎస్ఐ ఓ.దామోదర్, జగదేవపూర్ ఎస్ఐ చంద్రమోహన్ లు సంఘటన స్థలానికి చేరుకుని పంచానామ నిర్వహించి, పోస్టుమార్టు నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. మృతుడి తల్లి సుగుణమ్మ ఫిర్యాదు మేరకు మర్కుక్ ఎస్ఐ కేసు నమోదు చేసి పలు కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రవల్లిలో యాదవుల సదర్ పండుగ

నవతెలంగాణ-మర్కుక్



మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో గురువారం రాత్రి యాదవ సంఘం అధ్వర్యంలో సదర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో డోలు చప్పులతో, దున్నపోతుల ఆట, పాటల విన్యాసాలతో అంగరంగ వైభవంగా సదర్ పండగను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ జెడ్పీటీసీ రామచంద్రం యాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ కమ్మరి బాల్ రాజ్‌లు హజరైయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువజన నాయకులు, తదితరులున్నారు

పత్తి తీతలో జాగ్రత్తలు తప్పనిసరి పాటించాలి

-మండల వ్యవసాయ ఆధికారి టి.నాగేందర్ రెడ్డి

నవతెలంగాణ-మర్కుక్



రైతులు పత్తి తీసే సమ యంలో అప్రమత్తంగా ఉండాలని మర్కుక్ మండల వ్యవసాయ అధికారి టి నాగేందర్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండలం లోని పాములపర్తి లో పత్తి సాగు చేసిన రైతు పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమయంలో మంచు అధికంగా కురుస్తున్నందున, మంచు తగ్గిన తర్వాత పత్తి తీయాలన్నారు. అధిక వేడి ఉన్నప్పుడు పత్తిని తీస్తే వెంటనే నీడలో వేయాలని, ఇలా చేస్తే తేమ తగ్గి పత్తి నాణ్యతగా ఉంటుందన్నారు. పత్తి విప్పిన 5నుంచి 6రోజుల్లో పత్తిని తీయాలన్నారు. లేనిపక్షంలో తేమ ఎక్కువై సూటిమోల్డ్ వచ్చే అవకాశం ఉంటుందని, రైతులు తప్పనిసరిగా వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించడంతో పాటు లాభాలు ఆర్జిస్తారన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రజినీకాంత్ , రైతులు ,తదితరులున్నారు.

దేశం కోసం ప్రాణాలర్పించిన మాజీ ప్రధాని ఇందిరా గాంధీ

ఇండియా అంటేనే ఇందిరా గాంధీ

















నవతెలంగాణ-బెజ్జంకి

ప్రాణాపాయ స్థితి ఉందని తెలిసి దేశం కోసం ప్రాణాలర్పించిన మహిళ ప్రధాని ఇందిరా గాంధీయేనని, ఇండియాంటేనేఇందిరా గాంధీ అని ఏఎంసీ చైర్మెన్ పులి క్రిష్ణ కొనియాడారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మండలాధ్యక్షులు ముక్కీస రత్నాకర్ రెడ్డి అధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ శ్రేణులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళల అభ్యున్నతికి అహర్నిశలు కృష చేసిన గొప్ప ప్రధాని ఆమెనని రత్నాకర్ రెడ్డి తెలిపారు. ఏఎంసీ వైస్ చైర్మెన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షులు కర్రావుల శంకర్, మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, నాయకులు రొడ్డ మల్లేశం, జెల్ల ప్రభాకర్, బైరి సంతోష్, జేరిపోతుల మధు, ఇస్కిల్ల ఐలయ్య, బొనగం రమేశ్, ఐలేని శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ బండిపెల్లి రాజు, తదితరులు హజరయ్యారు.

దుబ్బాక : దివంగత ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం దుబ్బాక పట్టణంలో కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పీఏసీఎస్ వైస్ చైర్మెన్ కాల్వ నరేష్, కాంగ్రెస్ దుబ్బాక మున్సిపల్, మండలాధ్యక్షులు ఏసురెడ్డి, కొంగర రవి, ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు అనంతుల శ్రీనివాస్, ఆకుల భరత్, మంద శ్రీనివాస్, మచ్చ శ్రీనివాస్, జనార్ధన్ రెడ్డి పలువురున్నారు.

మర్కుక్: భారతదేశ తొలి మహిళా ప్రధాని, ఉక్కు మహిళ , ఇందిరా గాంధీ 40వ వర్ధంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలో మర్కుక్‌లో కాంగ్రెస్ మర్కుక్ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బబ్బురు మల్లేశం గౌడ్, ర్యాకం యాదగిరి , సాయిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, పత్తి నర్సింలు, వనం ఆంజనేయులు, శంకర్, తిరుపతి రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, స్వామి, తదితరులున్నారు.

గజ్వేల్: గజ్వేల్ పట్టణంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 40వ వర్ధంతి సందర్భంగా ఇందిరాపార్క్ వద్ద ఉన్న ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మెన్ గాడిపల్లి భాస్కర్‌లు మాట్లాడుతూ ఇందిరా గాంధీ చేసిన సేవలు మరువలేనివని, ఇందిరమ్మ రోటి కపడ మాక్కన్ నినాదంతో ముందుకు సాగుతూ పేద వాళ్లకు ఇండ్లు భూమి ఎడ్లు పంచిన ఘనత ఆమెకి ఉందన్నారు. పేదవాడికి ఆర్థిక స్వలం పన్న సాధించటానికి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేయడం కాకుండా బ్యాంకులను జాతీయం చేసిన ఘనత, రాజా అభరణాలు రద్దు చేసిన ఘనత ఇందిరాగాంధీకే దక్కిందన్నారు. కార్యక్రమం జగదేపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ నర్సింహారెడ్డి వహీద్ యాదయ్య, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గంగిశెట్టి రాజు, నక్క రాములు గౌడ్, గాడిపల్లి శ్రీను, సుభాష్ చంద్రబోస్, జహీర్ నక్క, రేగొండ శీవులు, గుండు లక్ష్మణ్, కన్న యాదవ్, అజ్గర్, డప్పు గణేష్, కొడకండ్ల బాలు అజీమ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండపాక: ఇందిరా గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొండపాకలో నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి, చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమం లో డీసీసీబీ చైర్మెన్ చిట్టి దేవేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు లింగారావు, నాయకులు మల్లేశం, సురేందర్, నర్సింలు ఉన్నారు.

మద్దూరు: మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలను మద్దూరు మండల కేంద్రంలో చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కామిడీ జీవన్ రెడ్డితో కలిసి కాంగ్రెస్ మండల అధ్యక్షులు మేక మల్లేశం, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు ముస్త్యాల మనోహర్, కార్యదర్శి బూర్గు శంకర్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎఫ్ఎం షౌకత్ అలీ, నాయకులు పద్మా రెడ్డి, బాలరాజు, బాలయ్య, కనక చంద్రం, సత్యనారాయణ, రాంబాబు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కోహెడ: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గురువారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు మంద ధర్మయ్య అధ్వర్యంలో మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడిన గొప్ప నాయకురాలు అని కొనియాడారు. గరీబీ హఠావో నినాదంతో, 20 సూత్రాల పథకంతో బడుగు బలహీన వర్గాలకు ఎన్నో రంగాల్లో అభివృద్ధికి కృషిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో కోహెడ మండల కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల : ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం చేర్యాల పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మంచాల చిరంజీవులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ పుర్మ ఆగం రెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీకాంత్, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, ముస్త్యాల యాదగిరి మార్కెట్ డైరెక్టర్లు పాల లక్ష్మి నారాయణ, తడ్క లింగం, నాయకులు కాటం శ్రీనివాస్, కాశెట్టి ఉపేందర్, అంబాల రాము గౌడ్, పోతుగంటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు ఎంత కష్టం

నవతెలంగాణ-దుబ్బాక



ఆరుగాలం శ్రమించే అన్నదాతలకు కష్టాలు తప్పడం లేదు. చేతికి వచ్చిన పంట కళ్ళముందే తడిసి ముద్ద కావడం కలవరానికి గురిచేస్తుంది. దుబ్బాక మున్సిపల్‌తో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం గంట పాటు కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. గత వారం రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఆగమవుతున్నారు. వర్షాలు కురిసి పంటలు బాగా పండాయన్న సంతోషం రైతుల కళ్ళల్లో కనిపించకుండా చేస్తుంది. వరి పంటలు చేతికొచ్చి కోసిన పంటను అటు ఆరబెట్టలేక పంటను కోయాలంటే భయపడుతున్నారు. కానీ కోయకపోతే వర్షాలకు పంటలు నేలకొరుగుతున్నాయి. కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం వర్షాలకు వరదల్లో కొట్టుకుపోతుంది. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట వార్డులో గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల వద్ద, పంట చేల వద్ద ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిసి వరద నీటిలో కొంతమేర కొట్టుకు పోయింది. ప్రతిరోజు కురుస్తున్న వానలకు ధాన్యం కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా తిప్పలు పడాల్సి వస్తుందని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు ఏర్పాటు చేసి తూకం వేయాలని, తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పదవీ విరమణ పొందిన ఆర్టీసీ డ్రైవర్

- సిద్దిపేట నివాసికి జీడిమెట్ల డిపోలో ఘనంగా సత్కారం

-ఒకే డిపోలో 30 ఏండ్లు ఆర్టీసీ సంస్థకు అద్భుతమైన సేవలు

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్



రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ హైదరాబాద్ పరిధిలోని జీడిమెట్ల డిపో బస్సు డ్రైవర్‌గా విధులు నిర్వహించిన సిద్దిపేట నివాసి కెమ్మసారం ఎల్లయ్య గురువారం పదవీ విరమణ పొందారు. టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో జీడిమెట్ల డిపో మేనేజర్ ఆంజనేయులు, కెమ్మసారం ఎల్లయ్య ఆయన భార్య రాజమణిలను ఘనంగా సన్మానించి ప్రశంస పత్రన్నీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లయ్య 30 ఏండ్ల పాటు ఒకే డిపోలో పనిచేస్తూ ఆర్టీసీకి అద్భుతమైన సేవలందించారని కొనియాడారు. ఆర్టీసీకి కేఎంపీఎల్ టార్గెట్ కంటే ఎక్కువగా తెచ్చి గతంలో ఐదుసార్లు ఉత్తమ డ్రైవర్‌గా అవార్డులు తెచ్చుకున్నారన్నారు. చేసే పనినీ ఇష్టపడుతూ అందరితో కలిసి మెలిసి ఉండే మనస్తత్వం ఎల్లయ్యది అని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం జీవితాన్ని కుటుంబ సభ్యుల మధ్య ఉల్లాసంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పదవి విరమణ పొందిన ఎల్లయ్యను ఆర్టీసీ అధికారులు, తోటి ఉద్యోగులు, సిబ్బంది సమక్షంలో ఘనంగా పూలదండలతో, శాలువా లతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల డిపో అసిస్టెంట్ మేనేజర్ నీలామని, టీఐజెడ్ విపి.సింగ్, ఎడిసి ఎన్.ఎస్ రాజు, హరికిషన్, ఏఈ (ఎం) సందీప్, ఎంప్లాయిస్ ఎస్సీ ఎస్టీ ప్రెసిడెంట్ బాబు, డ్రైవర్లు జి శ్రీనివాస్, సంజీవ్, సురేష్, ఫరీద్, రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ కేంద్రాన్ని వినియోగించుకోవాలి

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్



యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి నెల రోజులపాటు జరిగే ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని యూనియన్ బ్యాంకు ఆఫ్ సిద్దిపేట రీజినల్ మేనేజర్ వికాస్ అన్నారు. శుక్రవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచితంగా నెలరోజుల పాటు మగ్గం వర్క్స్, బోటిక్ మేనేజ్మెంట్, ఉమెన్స్ బ్యూటీ పార్లర్ పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత మగ్గం కిట్ ఉచిత కోర్సు మెటీరియల్ యూనిఫామ్ ఉదయం టిఫిన్ తో పాటు మధ్యాహ్న భోజనం, టి సౌకర్యం కూడా కల్పించడం జరుగుతుందని తెలిపారు. 30 రోజుల శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు అర్హత కలిగిన వారికి బ్యాంకు లోన్ కూడా ఇస్తామని తెలిపారు. 18 నుంచి 40 ఏండ్లలోపు ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న మహిళలు ఆధార్ కార్డు, రేషన్ కార్డు మూడు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు బ్యాంక్ పాస్బుక్, పదవ తరగతి మెమోతో సంబంధిత కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో సంస్థ డైరెక్టర్ రాజలింగం, లీడ్ డిస్టిక్ మేనేజర్ శ్రీహరి బాబు, పాల్గొన్నారు.

కార్మికుల పద్యానికి బహుమతి



నవతెలంగాణ- తొగుట

పారిశుద్ధ్య కార్మికుల గురించి బండ కాడి అంజయ్య గౌడ్ రచిం చిన పద్యం ద్వితీయ బహుమతి సాధించింది. శుక్రవారం ప్రెస్ నోట్ ద్వారా తెలిపిన సమాచా రం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీహరి కోటలో 2024 అక్టోబర్ నెలలో షార్ వాణి సంస్థ నిర్వహించిన సీవీఎస్ మహేశ్వర్ స్మారక కథలు, కవితలు, పద్యాలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పారిశుద్ధ్య కార్మికుల గురించి రచించిన పద్యం ద్వితీయ బహుమతి పొందిందని తెలిపారు.

సీ...
తూరుపు కొండపై తోయజ మిత్రుండు
ఉదయించక మునుపె నిదుర లేచి
కర్తవ్యదీక్షతో కార్యోన్ముఖు లగుచు
వీథుల నూడ్చుచు విమలమైన
రహదారులన్నియు రమణీయముగ మార్చు
చుందురహో సందు గొందులన్ని
పారిశుద్ధ్య పనులె పరమాత్మ సేవగా
భావించునట్టి యో ప్రాజ్ఞులార!
గీ..
మీరు లేకున్న వీథులపారమైన
కంపు వాసనగొట్టుచు కొంపలందు
నిలువ జాలమో క్షణమైన నిజము,కొనుడు
పారిశుద్ధ కార్మికులార ప్రణతులివియె!!
సీస..
దేశ సరిహద్దులో ధీరులై పోరాడు
సైనిక వీరుల సాటిమీరు
దుక్కి దున్నుచు నొక్క బుక్క బువ్వను బెట్టు
రైతుల సరిసాటి శ్రామికులహొ
నవ సమాజమునకై కవితలు రచియించు
సత్యవివర్యుల సాటిమీరు
కాలి గజ్జెలుగట్టి కదన శంఖంబూదు
గాయకులకుసాటి ధీయుతులుగ
తే.గీ
పొరక కట్టయే మీచేతి శరము గాగ
మలినముల్ తొల్గ జేయుచు మానితముగ
సమ సమాజపు సేవలో సాగుచున్న
పారిశుద్ధ్య కార్మికులార ప్రణతు లివియె!!

కడవేరుగు చెరువులో జలకల

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల మండల పరిధిలోని కడవేరుగు గ్రామ చెరువు గోదావరి జలాలతో జలకలను సంతరించుకుందని కాంగ్రెస్ యూత్ మండల నాయకులు ఆరుట్ల వినీత్ తెలిపారు. అలుగు పారుతున్న చెరువును గురువారం కార్యకర్తలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆరుట్ల వినీత్ మాట్లాడుతూ కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి చొరవతో తపస్ పల్లి రిజర్వాయర్ ద్వారా గోదావరి జలాలను రైతాంగానికి అందించాలనే సంకల్పంతో యాసంగి పంటల సాగుకు అవసరమైన నీటి వినియోగం కోసం భూగర్భ జలాల్లో నీటి నిల్వలను పెంచే విధంగా కృషి చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొంగల లింగారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు బాగోతం బాలచంద్రం, యూత్ అధ్యక్షుడు నేరటి విజయ్, సీనియర్ నాయకులు జల్లి అంజయ్య, తాడం భూపతి, కోమినేని నరేందర్, ఫరీద్, అనిల్ పాల్గొన్నారు.

కుట్రలను తిప్పి కొట్టేందుకు ఐక్యం పోరాటం

నవతెలంగాణ-నంగునూరు



మాలలపై జరుగుతున్న కుట్రలను తిప్పి కొట్టేందుకు మనమందరం ఐక్యంగా ఉండి పోరాడాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ గుడిమల్ల సత్తయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పెర్క రాజకుమార్, ఉపాధ్యక్షులుగా పంగ సంపత్ తోటపల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా తలారి నగేష్, సహాయ కార్యదర్శులుగా ఎర్ర రాజు, పంగ రవి కోశాధికారిగా పంగ కనకయ్య, కార్యవర్గ సభ్యులుగా పెర్క కనకయ్య, తలారి లక్ష్మయ్య, పంగ నర్సయ్య, ఎర్ర పోచయ్య, పంగ బాబు, పెర్క నవీన్, ప్రచార కార్యదర్శిగా తోటపల్లి రాజ్ కుమార్, సలహాదారులుగా రాగుల సారయ్య, ఎర్ర యాదయ్య, పంగ కుమార్, పంగ మల్లయ్య, పంగ యాదయ్యలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నియమక పత్రం అందజేసి వారు మాట్లాడారు. మాలలపై జరుతున్న కుట్రలను తిప్పికొట్టెందుకు ప్రతి ఒక్కరు పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కోదాది శ్రీనివాస్, అల్లిబిల్లి నర్సింగారావు, కిరణ్ యాదగిరి, నాయకులు రాంబాబు, రాజు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి రాష్ట్రంగా మార్చేందుకు రేవంత్ రెడ్డి కుట్ర

-రాబందుగా మారిన సీఎం

-బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్చార్జి ప్రతాప్ రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్



ఏపీలో తెలంగాణ రాష్ట్రాన్ని కలిపి ఉమ్మడి రాష్ట్రం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్చార్జి ప్రతాప్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం పేరు తీసేసి ఆంధ్రప్రదేశ్లో మార్చేందుకు క్షేత్రస్థాయిలో కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. అంబేద్కర్ సచివాలయం, యాదాద్రి పునర్నిర్మాణం, సీక్రెట్ కట్టించిన చరిత్రలను రేవంత్ రెడ్డి తుడిచి వేయాలని ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శించారు. పది నెలల్లోనే తెలంగాణను అప్పుల కుప్పగా మార్చి రూ.8500 వేల కోట్లు అప్పులు చేశారని ఆయన అన్నారు. ఉద్యోగులు, విద్యార్థులు, హైడ్రా బాధితులు రోడ్డున పడ్డారని రోజు నిరసన వ్యక్తం చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విధివిధానాలు ప్రజలకు నచ్చడం లేదని ఆయన చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి, వైస్ చైర్మన్ జకీర్, మండలాధ్యక్షులు బెండ మధు, నాయకులు నవాజ్ మీరా, కృష్ణారెడ్డి, కనకయ్య, మల్లేశం యాదవ్, కౌన్సిల్ సభ్యులు బాలమణి, ఉప్పల మెట్టయ్య, పాల్గొన్నారు.

గతంలో వ్యవసాయం అంటే పండుగ

-ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్



గత పదేళ్లలో వ్యవసాయం పండగలా జరిగిందని, పండిన పంట లతో రైతులంతా ఆర్థికంగా ఎదిగారని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో రైతులందరూ సంతృప్తిగా పంటలు పండించుకొని విక్రయించుకున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతులు తృప్తిగా లేరని పండిన పంటకు గిట్టుబాటు ధర వచ్చే అవకాశం లేదన్నారు. వ్యవసాయం దండుగా మారిందని ఆవేదన చెందారు.గత ప్రభుత్వం లాగే కడుపులో పెట్టుకొని రైతులని చూసుకోవాలని, సన్న వడ్లకు ప్రభుత్వం ఇస్తున్న రూ.500 బోనస్ ను రైతులు పొందాలని, వచ్చే పంట కాలానికైనా అన్ని రకాల ధాన్యానికి ప్రభుత్వం బోనస్ చెల్లించాలని కోరారు. రైతులంతా ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు.

నవతెలంగాణ
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
శనివారం | 02 నవంబర్ 2024 | www.navatelangana.com

అకాల వర్షానికి నేలకొరిగిన వరి పంట




నవతెలంగాణ-రాయపోల్

ఆరుకాలం కష్టపడి పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షంతో పంట నష్టపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. శుక్రవారం దౌల్తాబాద్ మండలం ముత్యంపేట గ్రామంలో కురిసిన అకాల వర్షానికి వరి పంట నేలకొరిగింది. ముత్యంపేట గ్రామంలో చూడంగి రాజు మూడు ఎకరాలు వరి పంట సాగు చేయగా శుక్రవారం ఉదయం కురిసిన వర్షానికి పంట మొత్తం నేలకొరిగి వడ్లు రాలిపోయాయి. గ్రామాల్లో వానాకాలం సాగుచేసిన వరి పంటలు చివరి దశకు చేరుకొని కోతకు వచ్చాయి. ఈ సమయంలో అకాల వర్షం కురవడంతో వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే వరి కోతలు మొదలు కావడంతో వారి ధాన్యం తడిసి ముద్దయింది. వర్షాకాలం పూర్తయినప్పటికీ ఇప్పుడు వర్షాలు కురవడం వలన పంటలకు తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కూరగాయల సాగుపై అవగాహన

నవతెలంగాణ-అక్కన్నపేట



మండలంలోని కుందన్వానిపల్లి గ్రామంలో ఏఈవో శ్రీలత, హార్టికల్చర్ ఆఫీసర్ బాలాజీలు రైతు రమేష్ కూరగాయల తోటను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూరగాయల పంటల్లో ఆశించే తెగుళ్ళ, నివారణ చర్యల గురించి వివరించారు. కూరగాయలకు సంబంధించి సబ్సిడీ రూపంలో ప్రభుత్వం డ్రిప్ స్ప్రింక్లర్‌లను ఇస్తుందనీ, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఓ తరుపున కరుణాకర్, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ రవళి, డ్రిప్ భరత్, రైతులు స్వామిరెడ్డి, మోహన్ రెడ్డి, పాల్గొన్నారు.

ఇసుకనుఅక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-మద్దూరు

ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పట్టుకున్నట్లు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలిపిన వివరాల ప్రకారం దూల్మిట్ట, మండలం బైరాన్ పల్లి, గ్రామానికి చెందిన పెరిక సంపత్, అనే వ్యక్తి తన ట్రాక్టర్‌లో ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా రేబర్తి, గ్రామంలో పట్టుకున్నట్లు తెలిపారు, అక్రమంగా ఇసుకర తరలిస్తున్న ట్రాక్టర్ యజమాని పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లా యోగ, నెట్ బాల్ సెలక్షన్స్

నవ తెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట పట్టణంలోని టీటీడీసీ భవన్‌లో ఉమ్మడి జిల్లా యోగా, ప్రజ్ఞాపూర్ ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో నెట్ బాల్ ఎస్‌జీఎఫ్ జిల్లా ఎంపికలు శనివారం ఉన్నాయని జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సౌందర్యలు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ అందరు 14, 17 బాల బాలికల విభాగంలో ఎంపికలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఒరిజినల్ బోనఫైడ్, ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు.

ఘనంగా దీపావళి వేడుకలు



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని అన్ని గ్రామాలలో దీపావళి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున నుండే రైతులు పశువులను రంగులతో అలంకరించి, పూల మాలవేసి, పూజలు నిర్వహించి హారతులు తీసుకున్నారు. మండల కేంద్రమైన మర్కుక్ దుకాణ సముదాయాలు, కిరాణా దుకాణాలు, ఫర్టిలైజర్స్,హోటలు, వైన్స్‌లు, చికెన్ సెంటర్ల వద్ద యాజమానులు ప్రత్యేకంగా పూలతో అలంకరించి పూజలు నిర్వహించి, టాపాకాయలను కాల్చారు. ఈ కార్యక్రమంలో వివిధ దుకాణ సముదాయాల నిర్వహకులు తదితరులున్నారు.


విద్యుత్ షాక్‌తో పెంకుటిల్లు దగ్ధం



నవతెలంగాణ-రాయపోల్

ప్రమాదవశత్తు విద్యుత్ షాక్ తో పెంకుటిల్లు పూర్తిగా దగ్ధమైన సంఘటన దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మారుపాక అర్జున్ కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఊరికి వెళ్లడంతో గురువారం ఇంట్లో ఎవరూ లేరు. అదే రోజు అర్ధరాత్రి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో పెంకుటిల్లు పూర్తిగా దగ్ధమైంది. తెల్లవారుజామున స్థానికులు ఇంట్లో నుంచి పొగలు వస్తున్నాయని గమనించి అర్జున్ వాళ్లకు సమాచారం అందించారు. వాళ్లు ఊరు నుంచి వచ్చి చూసేసరికి పెంకుటిల్లు పూర్తిగా దగ్ధమై ఇంట్లో ఉన్న వస్తువులన్నీ ఖాలిపోయాయి.ఏలాంటి ప్రాణ నష్టం కల్గలేదు. కానీ ఇంట్లో ఉన్న రూ.2 లక్షల నగదు, తులం బంగారం, 20 తులాల వెండి, ఇంట్లో ఉన్న వస్తువులన్నీ పూర్తిగా దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు. ఉన్న ఒక్క ఇల్లు పూర్తిగా మంటల్లో ఖాలిపోయేసరికి కన్నీరు మున్నీరవుతున్నారు. అనంతరం రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడంతో మండల ఆర్ఐ ప్రభాకర్ రావు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. గ్రామస్తులు ప్రభుత్వం కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారి సురభి కాలేజీ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక సీఐ కథనం ప్రకారం సుమారు తెల్లవారుజామున 3 గంటలకు గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని చూడగ తలకు రెండువైపులా గుర్తుపట్టకుండా గాయాలయ్యాయి. మృతదేహాన్ని గజ్వేల్ గవర్నమెంట్ హాస్పిటల్‌లో మార్చురులో భద్రపరచడం జరిగిందన్నారు. మృతుని వయస్సు 30 నుంచి 35 ఏండ్లు వుండి, వైలెట్ కలర్ టీ షర్టు, కుడి చేతి పై టాటో, జేలంధర్, లైట్ బ్లూ కలర్ లుంగీ కట్టుకొని, పింక్ కలర్ చెద్దరీ కప్పుకొని ఉన్నాడు. మృతున్ని ఎవరైనా గుర్తుపడితే 8712667331, 87126 67460, గజ్వేల్ పోలీసులకు సమాచారం అందించాలని సీఐ సైదా కోరారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య


ఫైల్

నవతెలంగాణ-దుబ్బాకరూరల్

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని పోతారెడ్డిపేట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ హరీష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తుమ్మల దేవదాసు (59) గత కొంత కాలం నుంచి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ విషయమై తన భార్యతో తరచుగా చెప్పుకొని తనకు బతకాలని లేదని బాధపడుతూ ఉండేవాడు. ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్ళాడు. మృతిని పెద్ద కుమారునికి అప్పనపల్లి స్వామి ఫోన్ చేసి మీ నాన్న చెరువు దగ్గరకి వెళ్తున్నాడని చెప్పగా కుటుంబ సభ్యులందరూ చెరువు దగ్గరికి వెళ్లి చూడగా గట్టుపై ఫోన్, చెప్పులు కనబడటంతో గ్రామస్తులు అతని చెరువులోకి దిగి బయటకు తీయగా అప్పటికే దేవదాసు మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు కొడుకులు, ఒక కూతురు కాగా కూతురు వివాహం చేశాడు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక తన భర్త చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాళం పగలగొట్టి ఇంట్లో చోరీ

-నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరణ

నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఈ సంఘటన గజ్వేల్ పట్టణంలో శుక్రవారం వెలుగు చూసింది. గజ్వేల్ అదనపు సీఐ ముత్యం రాజు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సంగాపూర్ రోడ్ లో చెరుకు రఘుపతి రెడ్డి నివాసం ఉంటున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం హైదరాబాదులో ఉండే తన పిల్లల వద్దకు దీపావళి పండుగ కోసం వెళ్లారు. అదే ఇంట్లో కిరాయికి ఉంటున్న వారు తిరుపతి రెడ్డి ఇంట్లో చోరీ జరిగినట్లు గమనించారు. వెంటనే ఫోన్ ద్వారా సమాచారం అందించారు. స్థానికుల సమాచారంతో తిరుపతిరెడ్డి నేరుగా బుధవారం గజ్వేల్ పోలీస్ స్టేషన్ చేరుకొని విషయం తెలపడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. విచారణలో నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు పోయినట్టు బాధితుడు ఫిర్యాదు చేశారు. అనంతరం కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు సీఐ ముత్యం రాజు తెలిపారు.

3న సిద్దిపేటకు మందకృష్ణ మాదిగ రాక

నవతెలంగాణ-సిద్ధిపేట : వికలాంగుల హక్కుల సాధన కోసం మందకృష్ణ మాదిగ వయోల గార్డెన్‌కు ఆదివారం రానున్నారని, జిల్లాలోని వికలాంగులందరూ హాజరుకావాలని వీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కెమ్మసారం అశోక్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వికలాంగులకు, బీడీ కార్మికులకు, ఇతర పెన్షన్ దారులకు పెంచుతానన్న పింఛన్‌ను పెంచాలని, ఆ అంశంపై మాట్లాడడానికి మందకృష్ణ మాదిగ రానున్నారని తెలిపారు. సిద్దిపేటలో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు..

బాధిత కుటుంబానికి సరుకుల అందజేత

నవతెలంగాణ-బెజ్జంకి :మండల కేంద్రానికి చెందిన రావుల కనుకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం శివసేన యువజన సంఘం కార్యవర్గ సభ్యులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం తమ వంతు సహాయంగా నిత్యావసర సరుకులు అందజేశారు. అధ్యక్షులు ఎలిగే సతీష్, కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షులు గుబిరే అనిల్, హరి ప్రకాష్, దొంతరవేణి మహేశ్, బోనగిరి బాబు ఉన్నారు.

మహిళల, పిల్లల రక్షణకు పెద్దపీట వేయాలి

-సీపీ. డాక్టర్ బి. అనురాధ.



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

పోలీస్ అధికారులు సిబ్బంది మహిళల, పిల్లల రక్షణకు పెద్దపీట వేయాలని, గంజాయి ఇతర మత్తుపదార్థాలపై పటిష్ట మైన నిఘా ఏర్పాటు చేయాలని సీపీ. డాక్టర్ బి. అనురాధ అన్నారు. శుక్రవారం సీపీ ఆఫీస్‌లో హుస్నాబాద్ డివిజన్ పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సీపీ మాట్లా డుతూ ఇన్ఫర్మేషన్ వ్యవస్థను మెరుగుపరుచు కోవాలని, నీతి నిజాయితీగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని, బెల్ట్ షాపులపై నిఘా పెంచాలని, పోక్సో క్రైమ్ అగ్నిస్ట్ ఉమెన్ కేసులలో సత్వరమే స్పందించి తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. నిజాయితీగా విధులు నిర్వహించని అధికారులపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో హుస్నాబాద్ ఏసీపీ సతీష్, హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, చేర్యాల సీఐ శ్రీను, ఎస్సై ఇన్స్పెక్టర్లు కిరణ్, శ్రీధర్ గౌడ్, సీసీఆర్బి ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ఎస్ఐలు మహేష్, రాజు, విజయ్ భాస్కర్, షేక్ మహబూబ్, పాల్గొన్నారు.

-హోంగార్డుల సంక్షేమానికి ఎల్లావేళలా కృషి

హోంగార్డుల సంక్షేమానికి ఎల్లావేళలా కృషి చేస్తామని సీపీ. డాక్టర్ బి. అనురాధ అన్నారు. శుక్రవారం సీపీ ఆఫీస్‌లో జిల్లాలో ఉన్న హోంగార్డు సిబ్బందికి దర్బార్ నిర్వహించి క్షేత్రస్థాయిలో ఉన్న వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ హోంగార్డ్స్ పోలీసు శాఖలో అంతర్గత భాగమేనని, హోంగార్డ్ సిబ్బందికి యూనిఫామ్ అలవెన్స్ త్వరలో అందజేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరికి హెల్త్ ప్రొఫైల్ తయారు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి దర్బార్ నిర్వహించడం జరుగుతుం దని, క్రమశిక్షణ తప్పిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ దర్బార్ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఎస్సై ఇన్స్పెక్టర్ కిరణ్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ప్రసాద్, ధరణి కుమార్, ఆర్ఎస్ఐ బాలకృష్ణ, హోంగార్డ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నరేందర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, జిల్లాలో ఉన్న హోంగార్డ్ సిబ్బంది, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్న ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

-సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

నవతెలంగాణ-కొమురవెల్లి

రాజకీయ పార్టీలకు అతీతంగా శాంతిభద్రతలను కాపాడాల్సిన కొమురవెల్లి ఎస్ఐ రాజు కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నాడని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండలంలోని మర్రి ముచ్చాలలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి అధ్యక్షతన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్లారెడ్డి మాట్లాడుతూ ఎస్ఐ కాంగ్రెస్ నాయకులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ , ప్రతిపక్ష నాయకులు ప్రజా సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వెళ్తే పట్టించుకోకుండా అసభ్య పదజాలం వాడుతున్నారన్నారు. పోలీస్ స్టేషన్లో కాంగ్రెస్ కార్యకర్తలతో మంతనాలు జరుపుతున్నాడని ఆరోపించారు. గత నెల 22న కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డికి రసులాబాద్ , పోసాన్ పల్లిల్లో వడ్ల కొనుగోలు కేంద్రాల ప్రారంభం, కొండపోచమ్మ వద్ద సీసీ రోడ్ల శంకుస్థాపనల సందర్భంగా పోలీస్ ఎస్కార్ట్ ఏర్పాటు చేశాడని అన్నారు. మండలంలో భూ తగాదాల సివిల్ కేసుల్లో జోక్యం చేసుకుంటున్నాడని ఆరోపించారు. ఎస్సై వ్యవహార శైలిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఇదే విషయంపై నవతెలంగాణతో ఎస్ఐ రాజు మాట్లాడుతూ రసులాబాద్ వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని ముందస్తు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నక్కల యాదవ రెడ్డి, బొడిగం సురేందర్ రెడ్డి, పబ్బోజు దుర్గయ్య, పాషికంటి బాలరాజు, బూరుగు సత్తయ్య, మెరుగు నరేష్, బోయిని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ నాయకుడు మల్లన్న 11వ వర్ధంతి

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



హుస్నాబాద్ పట్టణ తొపుడు బండ్ల సంఘం వ్యవస్థాపకులు, సీపీఐ సీనియర్ నాయకుడు మేకల మల్లన్న యాదవ్ 11వ వర్ధంతిని శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడిపె మల్లేశ్ నాయకులతో కలిసి పులమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేకల మల్లన్న యాదవ్ నమ్మిన సిద్ధాంతం కోసం పేదల రాజ్యం స్థాపనే ధ్యేయంగా పనిచేసిన గొప్ప వ్యక్తిత్వం కలిగిన నాయకుడని అన్నారు. పేదల రాజ్యం కోసం సమాజంలో జరుగుతున్న పాలకుల పనితీరుపై నేటి యువత రైతులు కూలీలు శ్రమజీవులు ఏకమై ఉద్యమించాలని గడిపె మల్లేశ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజీవరెడ్డి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజు కుమార్, సీపీఐ మండల నాయకులు అయిలేని మల్లారెడ్డి, ఎండి అక్బర్, దండుగుల ఎల్లయ్య, ఎండి అంకుశావళి, పిసర వెంకటయ్య,చుక్క తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏ కు మార్చాలి

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



ముదిరాజ్ లను బీసీ-డి నుంచి బీసీ-ఏ కు మార్చాలని, కుల గణన జరిపి రిజర్వేషన్లు అమలు చేయాలని శుక్రవారం హుస్నాబాద్ ముదిరాజ్ నాయకులు బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్‌కు వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన బీసీ కమిషన్ బహిరంగ విచారణ సందర్భ ంగా ఉమ్మడి హుస్నాబాద్ మండల నాయకులు హాజర య్యారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నియోజ కవర్గ గౌరవ అధ్యక్షులు పెండ్యాల ఐలయ్య, హుస్నాబాద్ మండల అధ్యక్షులు పొన్నబోయిన శ్రీనివాస్, రేగొండ ఎఫ్‌సీఎస్ అధ్యక్షులు యెడల వనేష్ పాల్గొన్నారు.

విద్యా జ్యోతుల పథకానికి మోక్షం ఎప్పుడో..?

నవతెలంగాణ-సిద్దిపేట



చేవేళ్ల డిక్లరేషన్‌లో ప్రియాంక గాంధీ మాట్లాడిన మాటలు ఏమైయ్యాయని, అదే సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా జ్యోతుల పథకంలో భాగంగా 10వ తరగతి పాస్ అయిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.10 వేలు, ఇంటర్ పాసైతే రూ.15 వేలు, డిగ్రీ పాసైతే రూ.25 వేలు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పాసైతే రూ.లక్ష, పీహెచ్డీ పూర్తి అయితే రూ.5 లక్షలు ఇస్తామని చెప్పారని, అవి ఎప్పుడు అమలు అవుతాయని బీఆర్ఎస్‌వీ పట్టణ సమన్వయకర్త ఇరుగంటి రమేష్ ప్రభుత్వా ప్రశ్నించారు. సిద్దిపేటలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఓట్ల కోసం విద్యార్థులు గుర్తుకు వచ్చారని, ఓట్ల అనంతరం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నాయకులు గుజ్జ రాజు, పిట్ల రాకేష్, పడిగే లింగం, గుండెల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-రాయపోల్


ఫైల్

అప్పులు తీర్చే మార్గం కనబడక పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండలం ఆరేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రామన్నగారి రవి(43) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. కొద్ది రోజుల క్రితం వారి గ్రామంలో 20 గుంటల వ్యవసాయ భూమి కొనుగోలు చేశాడు. భూమి కొనుగోలు కోసం, ఇతర కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు తీర్చలేక, ఆ భూమిని మరల అమ్మకానికి పెట్టగా అమ్ముడుపోలేదు. అప్పులు తీర్చే మార్గం కనిపించక పోవడంతో మనస్థాపానికి గురై మద్యం త్రాగుడుకు బానిసయ్యాడు. గురువారం రాత్రి ఇంటికి ఆలస్యంగా వచ్చి అన్నం తిని నిద్రపోయాడు. జీవితంపై విరక్తిచెంది శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి వెళ్లి అతని వ్యవసాయ భూమివద్ద పురుగులమందు త్రాగి పడిపోయాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని భార్య స్వప్న ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. విషయం రవి సోదరుడు రామన్నగారి భాస్కర్‌కు చెప్పడంతో ఇద్దరు గ్రామంలో వెతుకుతూ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చూడగా రవి అప్పటికే పురుగుల మందు తాగి పడిపోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో రవి మృతి చెందాడు. అనంతరం పోలీసులకు సమాచారం అందిం చడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.మృతుడి భార్య రామన్నగారి స్వప్న పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్ఐ రఘుపతి తెలిపారు.

భూమి తనపేర రాలేదని ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-దుబ్బాకరూరల్


ఫైల్

తన తండ్రి పేరు మీద ఉన్న భూమి తన పేరు మీదకి కాలేదని మనస్థాపంతో వ్యక్తి లుంగీతో ఉరివేసుకొని మృతి చెందాడు. ఈ సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఎనగుర్తి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది.ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పోషిగారి స్వామి (39).గత నెల రోజుల క్రితం తన తండ్రి అంజయ్య అనారోగ్య సమస్యలతో మృతి చెందాడు. ఆ రోజు నుంచి స్వామి మద్యానికి అలవాటు పడ్డాడు. తన తండ్రి పేరు మీద ఉన్న రెండు ఎకరాల భూమి తన పేరు మీద ఇంకా రాలేదని తన భార్యతో చెప్పుకొని తరచుగా బాధపడుతూ ఉండేవాడు. ఈ విషయం మనసులో పెట్టుకొని అందరూ తిని పడుకున్న తర్వాత ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. రాత్రి 11:30 గంటలకు తన భార్యకు మెలకువ వచ్చి చూడగా అతను ఇంట్లో కనిపించలేదు. వెంటనే మృతుడి భార్య రేణుక ,తల్లి నరసవ్వ కుటుంబీ కులతో కలిసి వెతుకగా కోటగిరి రామవ్వ ఇంటి దగ్గరలో ఉన్న మర్రిచెట్టుకు తన లుంగితో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతి భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఎస్ఐ తెలిపారు.

3న ధర్మ యుద్ధ సన్నాహక సభ

-ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరు

నవతెలంగాణ-బెజ్జంకి

జిల్లా కేంద్రంలో 3న తలపెట్టిన ధర్మ యుద్ధ సన్నాహక సభకు ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారని బెజ్జంకి పట్టణాధ్యక్షులు లింగాల బాబు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి బాబు మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హజరై ధర్మ యుద్ధ సన్నాహక సభను విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చింతకింది పర్శరాములు, అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకులు తాడిచెట్టు భూమయ్య, అంబేద్కర్ సంఘం పట్టణాధ్యక్షులు కొత్త రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవోను సన్మానించిన రేషన్ డీలర్ల సంఘం

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ఆర్డీవోగా బాధ్యతలు తీసుకున్న చంద్రకళను శుక్రవారం గజ్వేల్ డివిజన్ రేషన్ డీలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఆర్డీవో సెక్షన్ ఆఫీసర్ సారిక కూడా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ డివిజన్ అధ్యక్షురాలు షబానత బస్సు అజీజ్, ములుగు మండల అధ్యక్షుడు చంద్రం, మర్కుక్ మండల అధ్యక్షుడు కవితా బాల నర్సయ్య, గజ్వేల్ మండల రేషన్ డీలర్ ప్రధాన కార్యదర్శి రాజు, డివిజన్ రేషన్ డీలర్ల సంఘం నాయకులు వజీర్ ఖాన్, కుమారస్వామి, లక్ష్మీ నరసయ్య, ప్రసాద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరేందర్

నవతెలంగాణ-గజ్వేల్



టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుంచు నరేందర్ ఎంపికయ్యారు. గురువారం సిద్దిపేటలో నిర్వహించిన టీపీటీఎఫ్ శాఖ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరంగా పోరాటం సాగిస్తామని అన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు వచ్చే ఇంక్రిమెంట్లు ఇతర సౌకర్యాలను వెంటనే అమలు చేయాలని కోరారు. టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం సమస్యలపై నిరంతరంగా పోరాటం సాగిస్తుందని చెప్పారు. నన్ను ఎన్నుకున్న ఉపాధ్యాయులకు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

నవతెలంగాణ-చేర్యాల



మండలంలోని వీరన్న పేట గ్రామ పంచాయతీ కార్యదర్శి రాగుల రాంబాబు ఇదే మండలంలోని శభాష్ గూడెం గ్రామానికి బదిలీ కాగా శుక్రవారం వీరన్నపేట పంచాయతీ కార్యాలయంలో రాంబాబుకు తాజా మాజీ సర్పంచ్ కొండపాక బిక్షపతి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ సర్పంచ్‌గా ఉన్న ఐదేండ్ల పదవి కాలంలో తనతో పాటు గ్రామాభివృద్ధిలో తనదైన పాత్రను పోషించారని కొనియాడారు.

విరహత్ అలీని కలిసిన వంగ మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేట



వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీని శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో మర్యాదపూర్వకంగా కలిసినట్లు కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ పీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి, పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదరసుపల్లి శశిధర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారాలు మొదలగు విషయాలపై సుదీర్ఘంగా ఆయనతో చర్చించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడానికి సూచనలు, సలహాలు ఇవ్వవలసిందిగా కోరినట్లు తెలిపారు.

చీకటిని పారదోలి వెలుగును ప్రసాదించేదే దీపావళి


గజ్వేల్


గజ్వేల్



రాయపోల్

నవతెలంగాణ-గజ్వేల్

అందరికీ సిరి సంపదలు రావాలని మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడి పల్లి భాస్కర్ కళ్యాణి దంపతులు కోరారు. దీపావళి పండుగ సందర్భంగా ఇంటిలో ప్రత్యేక పూజలు నిర్వహిం చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ తో పాటు గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రజలు సిరిసంపదలతో సుఖసంతోషాలతో జీవించాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి నాయక త్వంలో గజ్వేల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని కోరుకుం టున్నామ న్నారు. **రామకోటి కార్యాలయంలో:** దీపావళి లక్ష్మీదేవి పూజలు గజ్వేల్‌లోని శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో రామకోటి కార్యాలయంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు, జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలో చీకటి తొలగిపోయి వెలుగులు విరజిమ్మాలని కోరారు. మన జీవితాల్లో కష్టాలు, బాధలు అనే చీకటులను పారద్రోలి, సంతోషం, ఆనందం అనే వెలుగులు ఈ దీపావళి వల్ల రావాల న్నారు.

రాయపోల్: మానవ జీవితంలో చీకటి అనే అజ్ఞానాన్ని తొలగించి వెలుతురు అనే జ్ఞాన జ్యోతిని వెలిగిం చడమే దమ్మా దీపావళి జ్ఞాన దీపావళి అంటారని రాయపోల్ ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షులు పుట్ట రాజు అన్నారు. గురువారం రాయపోల్ మండల కేంద్రంలో దమ్మ దీపావళి వేడుకలు నిర్వహించారు. జ్ఞాన దీపావళి వేడుకల్లో ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సామాజిక ప్రజాసేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్, కోశాధికారి మహమ్మద్ ఉమర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీపావళి అంటేనే దీపాల వరుస. చుట్టూ ఉన్న చీకటిని పారదొలి వెలుతురును నింపడానికి సంకేతంగా దీపావళి పండుగను నిర్వహిస్తారు. ఆరో శతాబ్దంలో సిద్ధార్థుడు జ్ఞానవం తుడిగామారి బుద్ధుడుగా అవతరించిన తర్వాత కపిలవస్తు నగరానికి తన శిష్యులతో తిరిగి వచ్చే రోజు దారి పొడవున దీపాలు వెలిగించి స్వాగతం పలుకుతారు. జ్ఞానం అనే వెలుగును ప్రసాదించే వ్యక్తి వస్తున్నాడని తన స్వంత రాజ్య ప్రజలు దీపాలు పెట్టి స్వాగతం పలికిన రోజు దీపావళి. అందుకే ఆ రాజ్యం బుద్ధుడు వచ్చిన రోజును దీపాల వరుస పండుగ చేసుకొని రాజ్య ప్రజలందరూ బుద్ధుడు చెప్పిన జ్ఞాన బోధ విని బౌద్ధాన్ని స్వీకరించిన రోజుని అన్నారు. చీకటి అజ్ఞానం నుంచి వెలుగు జ్ఞానంకి మారిన రోజు కార్తీక పౌర్ణమి రోజు బౌద్ధ దేశాలు సైన్టిఫిక్ బుద్ధ డే గా చేసుకుంటాయన్నారు.బౌద్ధం ప్రకారం దుఃఖం అంటే పేదరికం,అణిచివేత, మూఢ నమ్మకాలు, అజ్ఞానం నుంచి విముక్తిని చెయ్యడం అని అర్థం. ఈ దీపావళి అనేది పాళీ భాష పదం. దీపావళి రోజున బుద్ధుడు విస్తృతంగా జ్ఞాన బోధ చేశాడు.

మదన్ మోహన్ వర్ధంతి వేడుకలు

నవతెలంగాణ-సిద్దిపేట



అనంతుల మదన్ మోహన్ వర్ధంతి వేడుకలను స్థానిక బాలసదనంలో ఘనంగా నిర్వహించినట్లు కాంగ్రెస్ నాయకులు మార్క సతీష్ కుమార్ తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. హాస్టల్ విద్యార్థులకు బుక్స్, బిస్కెట్లు అందించి, భోజనం వడ్డిం చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దాస అంజయ్య, అజ్జు యాదవ్, చిక్కుడు అనిల్ కుమార్, సంతోష, స్రవంతి, స్నేహ, వెంగళ సుధీర్, ధర్మవరం రోహిత్, సందులాపురం లక్ష్మణ్, బాల్ కిషన్, అశోక్, లడ్డు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన విద్యాసంస్థల డైరెక్టర్ తిరుపతి రెడ్డి

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల మండల కేంద్రానికి చెందిన విద్యాసంస్థల డైరెక్టర్ కర్క తిరుపతి రెడ్డి తన అనుచరులతో కలిసి శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఆరుట్ల దశమంతా రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమెందర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమారాణి, రాష్ట్ర నాయకులు అంకుగారి శశిధర్ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ దండ్యాల లక్ష్మారెడ్డి, జిల్లా నాయకులు కుర్రారం బాల నర్సయ్య, రాపాక బుచ్చిరెడ్డి, మోకు ఉదయ కుమార్ రెడ్డి, దారావత్ బిక్షపతి నాయక్, బానోతు లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు







నవతెలంగాణ-నార్సింగి

మెదక్ శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు జన్మదిన వేడుకలను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కోసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు నార్సింగి ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రోహిత్ వందేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ఎన్నో పదువులను అధిగమించాలని వారు కోరారు. మండల పరిధి లోని శేరిపల్లి లో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీరామ్ భారత్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన ఎమ్మెల్యే జన్మదిన వేడుకలలో కాంగ్రెస్ నాయకులు కేక్ ను కోసి శుభాకాంక్షలు తెలిపారు. త్వరలోనే రోహిత్ రావు కు కేబినెట్ లో మంత్రి పదవీ లభించాలని ఆకాంక్షించారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మెదక్ జిల్లా ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు బాచి స్వామి, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, ఫిషర్మెన్ అధ్యక్షుడు సుధాకర్, సీనియర్ నాయకులు అంచనూరి రాజేష్, జహీర్, ప్రభాకర్, మోతీలాల్ పాల్గొనగా, శేరిపల్లి లో మాజీ సర్పంచ్ తాళ్ళ కృష్ణా గౌడ్, మున్నూరు కాపు సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మి నరసింహులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కేటీఆర్, కేసీఆర్ రాజకీయాల్లో నుంచి వెళ్లినా ప్రజలకు నష్టం లేదు

మెదక్ ఎంపీ రఘునందన్ రావు

నవతెలంగాణ-సంగారెడ్డి



కేటీఆర్, కెసిఆర్ రాజకీయాల్లో నుంచి వెళ్లిన తెలంగాణ ప్రజలకు ఎలాంటి నష్టం లేదు అని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కార్యాలయంలో బిజెపి క్రియాశీల సభ్యత్వ నమోదు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి, మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ బసవపురం లక్ష్మీ నరసయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త 100 సభ్యత్వాలు పూర్తిచేసుకుని క్రియాశీల సభ్యత్వాన్ని పొందాలని రానున్న వారం రోజులు కార్యకర్తల అందరూ క్రియాశీల సభ్యత్వానికి అర్హులు కావడం కోసం 100 సభ్యత్వాలను పూర్తి చేసుకోవాలన్నారు. గతంలో అధికారంలో ఉన్న 10 సంవత్సరాలు పాలించిన కేటీఆర్, కెసిఆర్ రాజకీయాల్లో నుంచి వెళ్లిన తెలంగాణ ప్రజలకు ఎలాంటి నష్టం లేదని అన్నారు. గతంలో మీరు ఫామ్ హౌస్ నాటకాన్ని తీసుకొచ్చారని అదే ఫామ్ హౌస్ నాటకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని అని అన్నారు. దీపావళి పండుగ ముందు రోజున ఎవరైనా మందు పార్టీలు చేస్తారని తెలంగాణలో ఎవరైనా మహిళలు మద్యం తాగుతారా అని ఇది రేవు పార్టీయా లేదా రావుల పార్టీయా అని అన్నారు. పదిమంది ఒక వద్దకు చేరితే పది బాటిళ్ల మద్యం తాగుతారా అని అది ఒక బార్‌లా ఉందని అన్నారు. కేటీఆర్ పాదయాత్ర చేసిన మోకాల యాత్ర చేసినా తెలంగాణ ప్రజలకు నమ్మకం లేదన్నారు . బిజెపి కేంద్ర నాయకత్వాన్ని అప్పుడున్న ప్రభుత్వం ఫామ్ హౌస్ స్టోరీలు సృష్టించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి, రాజశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వెంకట నరసింహారెడ్డి, ప్రతాప్ రెడ్డి, రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్, ఎడ్ల రమేష్, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి, రాజేశ్వరరావు దేశ్పాండే, దోమల విజయకుమార్,ద్వారకా రవి మందుల నాగరాజ్, రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు

నేడు ఎమ్మెల్యే జీఎంఆర్‌చే కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారం తహశీల్దార్ కార్యాలయంలో నవంబర్ 2న కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు తహసిల్దార్ బిక్షపతి తెలిపారు. లబ్ధిదారులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దుద్దెడలో పద్మశాలి చేనేత శోభాయాత్ర

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలంలోని దుద్దెడ గ్రామంలో దీపావళి పండుగ సందర్భంగా దుద్దెడ పద్మశాలి చేనేత సంఘం ఆధ్వర్యంలో గ్రామ దేవతలు అయిన ముత్యాల పోచమ్మ నల్ల పోచమ్మ మార్కండేయ శోభ యాత్ర మహోత్సవం ఆదివారం జరిగింది. పద్మశాలి సంఘం సభ్యులు ప్రత్యేక వాహనంపై మగ్గం పెట్టి చీరలను వేసుకుంటూ గ్రామంలో శోభ యాత్ర నిర్వహించారు. నేసిన చీరలను అమ్మవార్లకు సమర్పించారు. శోభయాత్రలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్దంకుల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, పద్మశాలి సంఘం అధ్యక్షులు బొజ్జమహదేవ్, వడ్లకొండ శ్రీనివాస్, బింగి భాస్కర్, గోనె శ్రీనివాస్ తదితరులున్నారు.

అంబరానంటిన దీపావళి సంబరాలు

నవతెలంగాణ- గజ్వేల్

గురువారం దీపావళి పండుగ సందర్భంగా ఇంటింటా దీపావళి పండుగ సంబరాలు అంబరాన్ని అంటాయి. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ తో పాటు మల్లన్న సాగర్ కాలనీలో ప్రజలు సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతి ఇంటి ముందు దీపాలు వెలిగించు ఉదయం నుంచి సాయంత్రం వరకు టపాసులు పేల్చి సంబరాలు నిర్వహిస్తున్నారు. చిన్న పెద్ద వ్యాపారులు వారి వారి దుకాణాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. నూతన దుస్తులు ధరించి దీపారాధన ఇంటింటి పొందారు. ముఖ్యంగా ఆడబిడ్డలు ఇంటిలో ఉన్నవారికి దీపారాధన అందిస్తారు. దీంతో తోచిన కట్న కానుకాలను ఇచ్చి ఆడబిడ్డలను దీవిస్తారు.

కమ్మిన కాలుష్యం

దీపావళి పండుగ సందర్భంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో టపాసుల మూలంగా కాలుష్యం కమ్ముకపోయింది. సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు వ్యాపారుల సంస్థల ముందు ఆయా ఇండ్ల ముందు బాణాసంచాలు కాల్చడంతో పొగ మంచు కమ్ముకొని చాలామందికి కళ్ళు, చెవులకు ఇబ్బంది కలిగిందని ప్రజలు ఆవేదన చెందారు. దీపంతులతో కూడా చాలా చోట్ల పొగలు వెలజలి కాలుష్యం పెరిగిపోయింది. దీపావళి పండుగ కాలుష్యం నింపేలా చేసిందని చెప్పాలి.

మండలంలో దీపావళి పండుగా వేడుకలు

నవతెలంగాణ- రాయపోల్

దీపావళి పర్వదినం పురస్కరించుకొని దౌల్తాబాద్ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఉత్సాహంగా, సరదాగా వేడుకలు నిర్వహిం చుకున్నారు. గురువారం ఉదయం దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. పశువులను సుందరంగా ముస్తాబు చేసి హారతి ఇచ్చారు. అలాగే ఇండ్లను సుందరంగా ముస్తాబు చేసి అలంకరించుకున్నారు. అమావాస్య రోజున చీకటిని పారదోలి అందరి జీవితాల్లో వెలుగులు విరజిమ్మాలని దీపావళి చేసుకుంటారు. అందరి ఇళ్లల్లో ప్రత్యేకంగా తీపి వంటలు, స్వీట్‌లు తయారు చేసుకొని కుటుంబ సభ్యులందరి కలిసి ఆనందంగా గడిపారు. చిన్నారులు, యువకులు టపాకాయలు కాలుస్తూ సంతోషంగా దీపావళి నిర్వహిం చుకున్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు

నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో దీపావళి పర్వదిన వేడుకలను అత్యంత ఆనందోత్సవాల మధ్య సాంప్రదాయ బద్ధమైన రీతిలో ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. ఇంటిల్లిపాది ప్రత్యేక పూజలు హారతులు లక్ష్మీ పూజలు చిన్నారుల కేరింతలు దీపావళి దివ్వెల అలంకరణతో చూడముచ్చటగా గ్రామ గ్రామాన దీపావళి వెలుగుల పండగ సంబరాలు శోభాయ మానంగా సందడి చేశాయి. టపాకాయలు కాల్చి స్వీట్లు పంచుకొని ఒకరికొకరు దీపావళి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మండల కేంద్రమైన జిన్నారం తో పాటు శివానగర్ సోలక్ పల్లి దాది గూడెం ఊట్ల మంగంపేట్ రాళ్లకత్వ జంగంపేట లక్ష్మీపతి గూడెం వావిలాల చౌదరి గూడెం గడ్డపోతారం చెట్ల పోతారం కిష్టయ్య పల్లి అలీనగర్ కొర్లకుంట మంత్రి కుంట నల్తూర్ మాదారం కొడకంచి పుట్టగూడ రాళ్లకత్వ తాండ ఖాజిపల్లి తదితర ప్రాంతాల్లో వ్యాపార సంస్థలు దీపావళి పండుగను ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పేకాట స్థావరలపై దాడి 14 మందిపై కేసు

నవతెలంగాణ-న్యాల్ కల్

దీపావళి పండుగ పేరిట.. పలు గ్రామాల్లో పేకాట స్థావరంపై దాడులు చేసి పేకాట ఆడుతున్న 14 మందిని పట్టుకొని వారిపై కేసులు నమోదు చేసినట్లు హద్నూర్ ఎస్సై చల్ల రాజశేఖర్ పేర్కొన్నారు. పట్టుబడ్డ 8 సెల్ ఫోన్లు రూ.54,680ల నగదు స్వాధీనం చేసుకొని కేసులు చేసి సీజ్ చేశామని ఎస్సై తెలిపారు. మండలంలో ఎక్కడైనా ఎవరైనా పేకాట ఆడితే తెలిస్తే చర్యలు తప్పవన్నారు.

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలి

నవతెలంగాణ-హత్నూర

రాష్ట్ర ప్రభుత్వం ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ దౌల్తాబాద్ గ్రామ కమిటీ అధ్యక్షులు అజ్మత్ అలీ (అజ్జు) ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను ఆర్భాటంగా ప్రారంభోత్సవాలు కొబ్బరికాయలు కొట్టడమేనని ఐకెపి పిఎసిఎస్ సెంట్రర్లలో కుప్పలు కుప్పలుగా ధాన్యపురాసులు పేరుకపోయి అకాల వర్షాలతో రైతులు ఇబ్బంది పడుతుంటే నిమ్మకు నీరెత్తినట్టు వ్యవరించడం సరైన కాదని ఆయన ప్రభుత్వంపై మండిపడ్డారు. ఐకెపి సెంటర్ల దగ్గర రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కోసం ఎదురు చూస్తూ ఉంటే కేవలం ప్రారంభోత్సవాలు కొబ్బరికాయలు కొట్టి చేతులు దులిపేసుకుంటున్నారన్నారు. ధాన్యం తరలించడం కోసం ఒక పాలసీ విధివిధానాలు రూపొందించకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. దొడ్డు వడ్ల కు కూడా బోనస్ రూ.500లు ఇవ్వాలని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని లేనియెడల రైతుల పక్షాన నిలబడి ఆందోళన చేయడానికి కూడా వెనకాడేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఘనంగా ఏఐటియుసి ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-రామచంద్రాపురం

ఏఐటియుసి కార్మిక సంఘం 105వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బిహెచ్ఇయల్ కీర్తిమాల్ బస్టాండ్ వద్ద గురువారం ఏఐటీయూసీ ఆవిర్భావదినోత్సవం సందర్భంగా జిల్లా అధ్యక్షులు నీరుడు సాయిలు జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్ మాట్లాడుతూ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీల స్థాపనకు ఐదు సంవత్సరాల ముందే తొలి కార్మిక సంఘం అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ)1920 అక్టోబర్ 31న బొంబాయి లోనీ అంపైర్ థియేటర్లో లాలా లజపతిరాయ్ అధ్యక్షతన స్థాపించారన్నారు. నేటి కార్మికులకు అనేక చట్టాలను తీసుకువచ్చిన ఘనత ఎఐటియూసి సంఘానిదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్, శంకర్, శ్రీకాంత్, సతీష్, పోచన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత టై బెల్టుల పంపిణీ

నవతెలంగాణ-మునిపల్లి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సేవా భావంతో టై బెల్టులను అందించడం హర్షణీయమని మండల విద్యాధికారి భీంసింగ్ అన్నారు. మండల కేంద్రమైన మునిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న చంద్రమౌళి తన కుమార్తె శ్రేష్ట జన్మదినం సందర్భంగా విద్యార్థులకు ఉచిత టైప్ బెల్టులు పంపిణీ చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి భీంసింగ్ మాట్లాడుతూ తన కూతురు పుట్టిన రోజు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరుపేద విద్యార్థులకు అండగా నిలవడంపట్ల ఉపాధ్యాయుడు చంద్రమౌళిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ప్రధానోపాధ్యా యులు అశోక్ కుమార్ దాత, ఉపాధ్యాయుడు చంద్రమౌళి, మండల వనరుల కేంద్ర సిబ్బంది నరేష్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఇందిరా గాంధీకి ఘన నివాళులు

నవతెలంగాణ-నార్సింగి

మండలంలోని శేరిపల్లి గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్ ఆధ్వర్యంలో గురువారం భారత దేశ తొలి మహిళా ప్రధాన మంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ విగ్రహానికి 40వ వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ ఆధునిక భారత దేశ నిర్మాత ఇందిరా గాంధీ అని, దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహా నాయకురాలని కొనియాడారు. దేశ చరిత్రలోనే బ్యాంకుల జాతీయ కరణ, హరిత విప్లవం, 1974 లోనే పరమాణు పరీక్షలు జరిపి భారత దేశానికి పరమాణు శక్తుల దేశాల సరసన ఆరవ దేశంగా నిలిపిన దూర దృష్టి కల నాయకురాలని గుర్తు చేసుకున్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసిన నాయకురాలు ఇందిరాగాంధీ అని, శేరిపల్లి గ్రామంలో అప్పుడు ఇందిరమ్మ ఇచ్చిన ఇండ్లలో, కృతజ్ఞతగా ఇందిరమ్మ విగ్రహం ఏర్పాటు చేసుకొని ఇందిరమ్మ కాలనీగా పేరు పెట్టుకోవడం జరిగిందన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఇండ్ల పంపిణీ భూమి పట్టాలు పంపిణీ చేయడం జరిగిందని వారన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆమె అడుగు జాడ లోనే నడుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్, నర్సింలు గౌడ్, శ్రీరామ్ మల్లేశ్, యూత్ నాయకులు బాలకృష్ణ గౌడ్, కందరి చినబాబు, చేప్యాల బాబు, చేప్యాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను నమ్మించి మోసం చేస్తున్న కాంగ్రెస్

నవతెలంగాణ-నార్సింగి

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్భాటం ఎక్కువ కార్యాచరణ తక్కువ అని బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి భూపతి రాజు ఎద్దేవా చేసారు. మండల కేంద్రంలో శుక్రవారం భూపతి రాజు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని హంగు ఆర్భాటాలతో వరి కోతలకు ముందే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని గత ప్రభుత్వంలో ఇలా ఎప్పుడూ జరగలేదని తమదే అసలైన రైతు ప్రభుత్వం అని ప్రఘల్బాలు పలుకుతూ హడావిడిగా ఐకేపీ, సొసైటీల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 15 రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేయడం మాత్రం మరించిందని మండి పడ్డారు. అందులోనూ మండల వ్యాప్తంగా ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు కావల్సిన ఆరు కొనుగోలు కేంద్రాలకు నాలుగు ప్రారంభించి శంకాపూర్, జప్తి శివునూర్‌లో ప్రారంభించ లేదన్నారు. రైతులు ఆరు గాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ఆరబెట్టిన వారి ధాన్యం కళ్లాలకే పరిమితమైందని, పలుచోట్ల చేసేదేమీ లేక రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకే ధాన్యాన్ని విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా కొనుగోలు కేంద్రాల వద్ద ఎందుకు ధాన్యం కొనుగోలు ప్రారంభించడం లేదని ఐకేపి అధికారులను, సొసైటీ చైర్మన్ లను అడగగా రైస్ మిల్లులకు అలాట్మెంట్ రానందున వల్ల ధాన్యం కొనుగోలు ప్రారంభించడం లేదని వారు చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు మేల్కొని వెంటనే కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలని, తడిసిన ధాన్యం సైతం పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.